ఆదివారం

ప్రజాశక్తి

డిసెంబర్ 19, 2004

హ్యాపీ బర్త్‌డే

(19-12-2004 నుంచి
25-12-2004 వరకు)

సత్యధీర్ శర్మ(కన్నా)
2సం॥, 19.12.2002
కవిత-శర్మ
మాధవరం-నల్లగొండ

బి. చందనరెడ్డి
8సం॥, 19.12.1996
శివశ్రీ-కోటిరెడ్డి
తాడేపల్లి-గుంటూరు

శృతి
3సం॥, 19.12.2001
సుధారాణి-జి.ఎల్. నర్సింహ్మారావు
కొర్లపహాడ్-నల్లగొండ

ఎ.అఖిలేశ్వరరావు
4సం॥, 20.12.2000
వరలక్ష్మి-శివకుమార్
కొత్తపేట-విజయవాడ



బి. రాహుల్‌వర్మ
4సం॥, 21.12.2000
జ్యోతిర్మయి-రాజగోపాలరాజు
కాకానినగర్-విశాఖపట్నం

పి.సుస్మిత
4సం॥, 22.12.2000
సువర్ణమ్మ-అంబన్నాచారి
గోరెబాళ్-కర్ణాటక

ఎస్. తరుణ్
4సం॥, 22.12.2000
అరుణ-రామారావు
మామిడిపల్లి-శ్రీకాకుళం

నిఖిల్‌సాగర్
1సం॥, 22.12.2003
రాణి-యాదగిరిసాగర్
కన్సన్‌పల్లి-మెదక్

జి.యశ్వంత్‌సాయి
1సం॥, 22.12.2003
యామిని-విజయ్‌కుమార్
అమరావతినగర్-తిరుపతి

ఎం. సాయిప్రభ
4సం॥, 22.12.1998
పద్మిని-రాంబాబు
సీతాఫల్‌మండి-సికింద్రాబాద్

చార్లెస్
1సం॥, 23.12.2003
గ్రేసురాణి-నాగేశ్వరరావు
క్రోసూరు-గుంటూరు

పి.నాగమౌనిక
డిసెంబర్-24
సుశీల-వెంకట్రావు
కొప్పోలు

యోగీశ్వర్
డిసెంబర్-23
సుగుణ-నారాయణ
నకిరేకల్-నల్లగొండ

జె. చిన్ను సహన్‌కుమార్
డిసెంబర్-19
జ్యోతి-శ్యాంకుమార్
దేశాయిపేట-వరంగల్

షహనాజ్ ఫాతీమా
డిసెంబర్-19
షమీవ్ ఫాతిమా-యాకుబ్‌పాషా
రంగంపేట-వరంగల్

జి.జశ్వంత్
2సం॥, 24.12.2002
బ్యూలా-శ్యాంబాబు
మార్కాపురం-ప్రకాశం

కె. త్రివేణినాయుడు
7సం॥, 25.12.1997
ఇందిర-హరిబాబు
కెపిహెచ్‌బి కాలనీ-హైదరాబాద్

కె. పావన్‌కుమార్
10సం॥, 25.12.1994
మారుతీకుమారి-హృదయకుమార్
కెపిహెచ్‌బి కాలనీ-హైదరాబాద్

ఆర్. హేమంత్‌కుమార్
5సం॥, 25.12.1999
రమణి-దుర్గాప్రసాద్
ఉక్కునగరం-విశాఖ

మరికొన్ని ఫొటోలు 3వ కవర్ పేజీలో చూడండి

లీడర్స్ మెయిల్

టు
ది ఎడిటర్, ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం

అద్దంలో చూపినట్లుంది

డిశెంబర్ 5వతేదీ కవర్‌స్టోరీ 'వికలాంగులైనా...ఎందులో తక్కువ?!' అద్దంలో చూపినట్లుగా ఓ చక్కని శైలిలో వివరించినందుకు ధన్యవాదాలు. ఆ కవర్‌స్టోరీ ద్వారా ఫిజికల్లీ ఛాలెంజ్‌డ్ పర్సన్స్‌లో ఎంతో ధైర్యాన్ని నింపారు. అందుకు సజీవ ఉదాహరణలుగా సచిత్రంగా కొందరు శక్తివంతుల్ని పరిచయం చేశారు. డా॥నాగినేని భాస్కరరావుగారి వ్యాసం 'ఎయిడ్స్‌ను ఎదురిద్దాం-చైతన్యంతో నిర్మూలిద్దాం' మా ముందుంచినందుకు ధన్యవాదాలు.

-బి వి శ్రీదేవి, చౌడవాడ, విశాఖజిల్లా

ఎవరికీ తీసిపోరు!

కవర్‌స్టోరీ కథనం చదివిన తరువాత ప్రపంచంలో వివిధరకాల అంగవైకల్యాలతో బాధపడేవారు తాము ఎవరికీ తీసిపోలేమని చెప్పేవిధంగా ఉంది. వివిధ రంగాలలో తమ ప్రతిభను చాటిచెపుతున్న తీరు బాగుంది. 'అంధుల విజ్ఞానానికి తగిన కృషిసల్పిన లూయిస్ బ్రెయిలీ చిరస్మరణీయుడు. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన రామలింగం రెండుకాళ్ళూ లేకున్నా మనోధైర్యంతో టైలరింగ్ నేర్చుకుని పదిమందికీ ఉపాధి కల్పించడం ఆనందదాయకం. కార్టూన్‌లతో అందరిని అబ్బురపరుస్తున్న రాగతిపండరి తగిన పేరు సంపాదించుకోవడం, చింతల సన్యాసిరావు తన కచేరీలతో ప్రేక్షకులకు వీనులవిందు చేయడం వారి కృషికి నిదర్శనంగా చెప్పుకోవచ్చు. మరుగుజ్జులను వికలాంగులుగా గుర్తించేందుకు వైయస్ ప్రభుత్వం తగిన కృషిచేయాలి.

-కామిడి సతీష్‌రెడ్డి(టీచర్),
జడలపేట, వరంగల్‌జిల్లా

మనిషిలోని మనస్తత్వాలు



కథ చాలా బాగుంది. 'టోకన్ నెంబర్ థర్టీన్' అనే పేరు ఆ కథకు చాలా బాగుంది. పదమూడవ నెంబరుతో మనిషిలోని మనస్తత్వాలు ఏవిధంగా మార్పుచెందుతాయో సెంటిమెంట్‌గా ఉమాశంకర్ పాత్రతో కథ నడిపించిన తీరు చాలా బాగుంది. ఈ వారం 'మనలోమాట' కూడా మాకు నచ్చింది.

-కొప్పల కాశీవిశ్వేశ్వరరావు,
మర్రిపాలెం, విశాఖపట్నం

సినీరంగ భీష్మ

కళాసాహితి శీర్షికలో ప్రచురించిన 'సినీరంగ భీష్మ' డి వి యస్ రాజు గురించి బాగుంది. ఆయన తెలుగు చలన చిత్రరంగ చరిత్రలో సుప్రసిద్ధ నిర్మాత. జానపద, సాంఘిక చిత్రాలనెన్నింటినో మరుపురాని విధంగా నిర్మించారు. తెలుగు సినిమాకు విశిష్ట చరిత్రను చేకూర్చడంలో రాజుగారు ఎంతో శ్రమించారు.

-మేడూరి సత్యనారాయణ,
ఖైరతాబాద్, హైదరాబాద్.

కార్టూన్లు బాగుంటున్నాయి

కార్టూన్ కదంబం చూసిన తరువాతే లోపలిపేజీల్లోకి వెళతాను. కార్టూన్‌ని చూడ్డంతోనే నేడు నడుస్తున్న దౌర్భాగ్య భారతదేశ రాజకీయాలు అర్థమవుతాయి. అప్రజాస్వామిక, అప్రయోజక, అరాచక పార్టీల ఈ వారపు తీరుకు అద్దం పట్టినట్లుగా ఉంటున్నాయి. ఈ సంచికలోని అన్ని విషయాలూ ఒకదానితో ఒకటి పోటీపడుతున్నంతగా బాగున్నాయి.

-సిరిపురపు రామకోటేశ్వరరావు,
ఎనికేపాడు, విజయవాడ రూరల్.



మనలో మాట

శబ్ద కాలుష్యం...

శబ్దమయ ప్రపంచమన్నారు!

అంచేత మనం శబ్దాలతో పాటు బతుకుతున్నాం. శబ్దంలేని ప్రపంచం మెదడ్ని పాడుచేస్తుంది!

శృతిమించిన శబ్దం కూడా-

ఆరోగ్యానికి మంచిది కాదు!

మతిలేని మాటలు ఎంత వికారంగా వుంటాయో-శృతిమించిన శబ్దాలు కూడా అంతే!

ఈతి బాధల్లో శబ్ద కాలుష్యం కూడా ఒకటి!

శబ్ద కాలుష్యం రోగాలూ రొష్టులూ తెచ్చిపెడతాయి. తిండి సయించదు. నిద్రపట్టదు. చిరాకు ఎక్కువవుతుంది. చొక్కాలు చింపుకోవాలనిపిస్తుంది. ఎవడ్నో ఒకడ్ని చితకబాదాలనిపిస్తుంది!

శబ్ద కాలుష్యం ఇంత రభసకి దారితీస్తుంది!

వాతావరణం ఎంత నిశ్శబ్దంగా వున్నా...ఆ నిశ్శబ్దంలో కూడా శబ్దముంటుందని శాస్త్రకారులు చెబుతుంటారు!

దాన్ని నిశ్శబ్ద శబ్దమని పిలుస్తారు! కొండొకచో కవులు నిశ్శబ్ద సంగీతమనికూడా అంటారు!

నిశ్శబ్దంలో శబ్దమేవిటి దరిద్రమని కోప్పడకండి. ఈ దరిద్రం ఎంతో అందంగా వుంటుంది!

ఊరికి దూరంగా పంట కాలవ పక్కన నిలబడండి. అంత నిశ్శబ్దంలో కూడా కొన్ని తియ్యటి శబ్దాలు తమ చెవిని సుతారంగా తాకుతుంటాయి!

పంటకాలవ నీళ్ళ తాలూకు గలగలలు తమర్ని అలరిస్తాయి. అదట్లా వుంచండి. ఏపుగా పెరిగిన పంటని గాలి పలకరిస్తుంది. పంట సమాధానమిస్తుంది!

ఈ ముచ్చట్లు వినగలిగే ఓపిక తమకుంటే వాటి సంభాషణ తమ చెవులకింపుగా వుంటుంది!

నా మాటమీద మీకు నమ్మకం లేకపోతే...కృష్ణశాస్త్రినడగండి. ఆయనేమంటాడో నాకు బాగా తెలుసు-

'కొమ్మల గువ్వలు గుసగుసమనినా...రెమ్మల గాలులు ఉసురుసురనినా...అలలు కొలనులో గలగలమనినా...'

ఎంత చెప్పినా ఏం లాభం?! మనది మహానగరు కదా!

ఇక్కడ శబ్దకాలుష్యమెక్కువ!

ఇక్కడ గాలి పలకరింపులుండవు. ఇక్కడ పంట సమాధానాలుండవు. ఇక్కడ వాటి సంభాషణ వినే ఛాన్సు మనకుండదు. ఇక్కడ మనం ఆపాటి అదృష్టానికి నోచుకోలేదు!

కనిపించని మార్కెట్టు మంత్రదండమేదో 'ఛూమంతర్' అనేస్తోందేమో...

మన నిశ్శబ్దాన్ని , నిశ్శబ్ద శబ్దాన్ని, నిశ్శబ్ద సంగీతాన్ని ఆరగించేస్తోంది!

ఈ సంచికలో . . .

ఔరా! ... 3
కార్టూన్ కదంబం... ... 4
కవర్ స్టోరీ ... 5
జీవనశైలి ... 10
బాలల కథ ... 11
బాలనేస్తాలు ... 12
ఇంతిసంగతులు ... 16
కచేరి ... 17
ఆరోగ్యం ... 18
పుస్తక పరిచయం ... 20
న్యాయసలహాలు ... 24

ఇంకా...

వలస పక్షి కథ ... 8, 9

శిల్పి
రియల్ స్టోరీ ... 14, 15

అభివృద్ధికి నోచుకోని లక్ష్మీ నృసింహ క్షేత్రం
టూరిస్ట్‌గైడ్ ... 21

సినీ సక్సెస్ రావు సి.ఎస్.రావు
కళాసాహితి ... 22, 23

పోస్టల్ వారి ప్రత్యేకసేవ

ప్రస్తుతానికి "స్పీడ్‌పోస్టు" అని యమా స్పీడుగా ఉత్తరాలు చేరేసే పథకం పెట్టారు. దానిలాగే వచ్చే క్రిస్టమస్ సందర్భంగా కేక్ పోస్టు, ఫ్లవర్ పోస్ట్, యాపిల్ పోస్ట్, మాంగో పోస్ట్ లాంటివి ప్రవేశపెడతామని అంటున్నారు. తమ పోస్టుమేన్‌లచే 'శాంతాక్లాజ్'తాతగారి అవతారం ఎత్తిస్తామంటున్నారు. సదరు ప్రజలు తమతమ కేక్‌లకు, బుకేలకు పోస్టాఫీసులద్వారా ఆర్డర్‌లు బుక్ చేసుకుంటే చాలు. ఆ పోస్ట్‌మేన్‌లు తమ డ్యూటీగా ఆ... సేవలు నిర్వర్తిస్తారుట. ఈ సేవలు క్రిస్టమస్‌వారం వరకేనని కూడా స్టాంపుగుద్ది మరీ చెబుతున్నారు మరి!

"ఉర్రే బాసూ... నీ పనై పోయింది"

స్పెయిన్‌దేశ కోపిష్టులకూ, ఒత్తిడుల (Stress)బాధితులకూ ఓ మాంఛి వైద్యముంది. జార్జి యాఁరిబస్ అనే మహానుభావుడు 'స్టాప్ స్ట్రెస్" అనే షాపు పెట్టాడు. ఆ షాపులో... ఓ రెండువేల మూడొందల అరవై రూపాయలు(28పౌండ్స్) ఫీజు కట్టి, తామెన్నుకున్న పాత కారో, కంప్యూటరో, టెలీవిజనో పెద్దసుత్తి(మలాటు)తో రెండుగంటలపాటు బద్దలుకొట్టే వైద్యమే ఆ ట్రీట్‌మెంట్! ట్రాఫిక్‌జామ్‌లు, కంప్యూటర్ల వినిగింపులు, బాస్‌ల-మేనేజర్ల-ఓనర్ల వేధింపులు, పనిభారాలు లాంటి వాటివల్ల కలిగిన ఒత్తిడులకు ఈ "డామేజ్ థెరపీ" బాగా పనిచేస్తోందని, అలా తెగ బాదుడు బాదాక తమకెంతో మనశ్శాంతిగా ఉందని చాలామంది క్లయింట్లు అంటున్నారు. అనేకమంది తమ బాస్‌ల ఫొటోలు తెచ్చుకుని కారు బోనెట్‌పై పెట్టి "ఉర్రే బాసుగాడా... ఈ దెబ్బతో నీ పని ఆఖరు" అంటూ సమ్మెటతో తమ బాస్‌పై... అదేలేండి బాస్‌ఫొటో పైన ఒక్కట్టిచ్చుకుంటున్నారుట!!

"దూడమేతకోసమే తాడిచెట్టెక్కా"



తాడిచెట్టెందుకెక్కావురా అంటే 'దూడ మేత క్కోషం!' అని ముద్దముద్ద మాటలతో అన్నాట్ట వెనకటికెవడో. వాణ్ణి గుర్తు తెచ్చే పని పెట్టుకున్నాడు మన వెంకయ్యానాయుడూజీ! బిజేపీ నాయకత్వ పగ్గాలకోసం ఓ చతుష్టయం సిగపట్టులు పట్టుకున్నారు కదా! ఆ ఫైటింగు ఆ నల్గురికీ లాభించలేదు. రాజీనామాలు, అందుకు కారణప్రకటనలు, దూషణ- భీషణలు అవాకులూ చెవాకులు అయ్యాయి. ఏ భాషనైనా అనర్ఘళంగా తెలుగు ఉచ్ఛారణలాగా గడగడాయించి దేశాన్ని అదరగొట్టిన వెంకయ్యానాయుడు అధ్యక్షపదవికి నీళ్ళొదిలాడు. 'ఛా... ఊర్కో... ఏంటిలే' అని అనునయించబోయిన వృద్ధనాయకాగ్రేసరులదగ్గ "ఇన్నాళ్ళూ నా కుటుంబాన్ని నిర్లక్ష్యం చేశాను. ఇకపై... ఈ క్షణం నుండి ఎక్కువ సమయం వారితో గడపాలనే నా రాజీనామా... ఒట్టు... అమ్మతోడు" అన్నాడు. ఆ మరుక్షణమే వేలూరు జైలునందు చింతాక్రాంతులై ఉన్న కంచిసాములోరు జయేంద్రులవారిని కలవడానికి వెళ్ళుతున్న 'లోహపురుష్' అద్వానీ వెంట తోకలెక్క వెంటపడి వెళ్ళాడు. కుటుంబసభ్యుల్దేముందీ... తర్వాత చూడొచ్చులే...!!!

కార్టూన్ కదంబం

హామీలు



కమిటీ
ఆర్టీసి
నష్టాలు
పెరుగుతున్న డీజిల్ భారం
ప్రైవేట్ వాహనాల
ఆర్టీసి పరిరక్షణకు ఉన్నతస్థాయి కమిటీ —ప్రభుత్వం



రిలయన్స్ షేర్ హోల్డర్
చీలిన రిలయన్స్ లోగో

కంఠంలో కోటి వీణలు కొలువైవున్నట్టు...
గుండెల్లో భక్తిరసం ఉప్పొంగుతున్నట్టు...
ఆమెగాత్రం

* * *

మనోవీణియపై కారుణ్యభావాన్ని
పలికిస్తున్నట్టు...
ఎదలోతులు అర్థమవుతున్నట్టు...
భజగోవిందం స్తోత్రం

* * *

ఆ గాత్రం సుబ్బులక్ష్మిది
ఆ స్తోత్రం సుస్వరలక్ష్మిది
ఆమె సంగీత రసధుని
నాద మాధుర్యపు గని

ఆమె కర్ణాటక సంగీత కళామతల్లికి అరుదైన ఆభరణం. ఆమెది కర్ణాటక సంగీతఖ్యాతిని పెంచిన సుమధురగాత్రం. అన్ని తరగతుల శ్రోతలకూ నాదమాధుర్యం చవిచూపిన ఆ కోయిలమ్మ గత శనివారం కన్ను మూసింది. ఇక సుప్రభాతగీతంలోనో... భజగోవిందం స్తోత్రంలోనో ఎమ్మెస్ సుబ్బులక్ష్మిని చూసుకోవలసిందే.

సుస్వరలక్ష్మి సుబ్బులక్ష్మి

వి. ఉదయలక్ష్మి

కొన్ని నియమాలకు లోబడి సాగేది కర్ణాటక సంగీతం. ఎంత విద్వత్తు వున్నా జనసామాన్యాన్ని రంజింపచేయడం కష్టం. కాసింత శిక్షణ, అవగాహన వుంటే గానీ మనసుకు హత్తుకోని మార్గసంగీతమది! అలాంటి కర్ణాటక సంగీతం పాడి అత్యధికుల్ని మెప్పించారు సుబ్బులక్ష్మి. డి.కె. పట్టమ్మాళ్, ఎం.ఎల్. వసంతకుమారి వంటి సాటి విద్వాంసుల గానం పండితులకే పరిమితం కాగా ఆమె మాత్రం జనసామాన్యానికి చేరువయ్యారు. పామరహృదయాల్ని సైతం రంజిల్లచేశారు. సంగీతకారిణిగా ఆమెది కళ్లను మిరుమిట్లు గొల్పే చరిత్ర. దాదాపు ఆరు దశాబ్దాల పాటు ఆమె సంగీతాభిమానుల హృదయాలపై రాగసుధారసం జాలువార్చారు.

సుబ్బులక్ష్మి 1916 సెప్టెంబరు 16న మదురైలో జన్మించారు. ఇంట్లోవారందరూ ఆమెను ప్రేమగా 'కుంజమ్మ' అని పిలుచుకునేవారు. ఆమెది సంగీత సంపద మాత్రమే కలిగిన కుటుంబం. ఆడపిల్లల్ని బయటకు పంపడానికి విముఖత చూపే సనాతన కుటుంబం. అమ్మమ్మ వాయులీనం వాయించేది. తల్లి షణ్ముగవడివు వైణిక విద్వాంసురాలు. అమ్మే సుబ్బులక్ష్మికి ఆదిగురువు. ఆమె వీణ వాయిస్తుంటే చిన్ని కుంజమ్మ గాత్రం కలిపేదిట. ఆపైన మదురై శ్రీనివాసఅయ్యర్ దగ్గర కొన్ని సంగీతపాఠాలు అభ్యసించింది. సోదరుని దగ్గర మృదంగం కూడా నేర్చుకుంది. ఐదో తరగతిలో వుండగా ఓ రోజు మాష్టారు కొడితే కుంజమ్మ ఆరోగ్యం దెబ్బతిందిట. దాంతో బడి మానేసింది. గంటల తరబడి సంగీత సాధనలో గడిపేసేది. తల్లి చేసే వీణ కచేరీల్లో కూడా పాడుతుండేది. షణ్ముగవడివు పదవ ఏటనే కుంజమ్మ చేత గ్రామ్‌ఫోన్ రికార్డింగ్ ఇప్పించింది. బాల్యంలో ఎందరో సంగీత విద్వాంసులు ఆమె ఇంటికి వచ్చిపోతుండేవాళ్లు. వాళ్లల్లో కొందరు ఒకటో రెండో పాటలు నేర్పుతుండేవాళ్లు. ఇక వాటిని పాడుకుంటూ ఆమె నిరంతరమూ గానప్రవాహంలో ఓలలాడుతుండేది. తొలి యౌవనదశలో తన సంగీతంతో ఎందరెందర్నో అలరించేది సుబ్బులక్ష్మి. పెళ్లిళ్లలో ఆమె సంగీతం ప్రధాన ఆకర్షణగా వుండేదిట! కొన్ని వారాల ముందు నుండే ఆమె పాటల గురించి తియ్యనికబుర్లు కూడా చెప్పుకునేవారట!! వీణై ధనమ్మాళ్ మనవడు టి. శంకరన్ మాటల్లో చెప్పాలంటే "ఆ రోజుల్లో మహిళా సంగీతకారుల్ని అంతగా పట్టించుకునేవారు కాదు. స్త్రీలు కచేరీలు చేసేందుకు అంతగా బయటకు వచ్చేవారు కాదు. వాళ్లను సంగీతకచేరీలకూ అనుమతించేవారు కాదు. సంగీతవేదికలపై పురుషాధిపత్యం రాజ్యమేలుతుండేది. ఓ ఆచారంగా ఆటపాటల్ని ప్రదర్శిస్తూ వస్తున్న దేవదాసీ స్త్రీలే సాధారణంగా పాడేందుకు బయటకురావడం కనిపించేది." అలాంటి సాంఘిక నేపథ్యంలో సుబ్బులక్ష్మి బయటకొచ్చి కచేరీలు చేశారు. శ్రోతల్ని అమితంగా ఆకర్షించారు. పదిహేడేళ్ల ప్రాయంలో మద్రాస్ మ్యూజిక్ అకాడమీలో సంగీతకచేరీ చేయడం ఓ గొప్ప విశేషం. ఆ కచేరిలో తల్లి స్వయంగా తంబురా వాయించారు. 1936లో మద్రాస్ చేరేనాటికి ఆమె గాత్రసంగీతకారిణిగా మంచి ఖ్యాతినార్జించారు. మ్యాగజైన్లు ఆమె కచేరీలకు అమిత ప్రాధాన్యత

నటిగా ఎంఎస్

సుబ్బులక్ష్మి పెళ్లికి ముందు 'సేవాసదన్', 'శకుంతలై' చిత్రాల్లో నటించారు. పెళ్లయిన తరువాత 'సావిత్రి', 'మీరా' చిత్రాల్లో మంచిపాత్రలు పోషించారు. మొదటి మూడుచిత్రాల అనంతరం ఆమె జనం దృష్టిలో ఓ 'గ్లామర్ క్వీన్'. 'మీరా'లో నటించిన తరువాత ఓ గొప్ప సంగీతకారిణి. తమిళం, హిందీ భాషల్లో నిర్మితమైన మీరాలో ఎంఎస్ పాడిన భజనలు ఆమెకు దేశవ్యాపిత ఖ్యాతినార్జించిపెట్టాయి. సదాశివం జాతీయభావాల వ్యాప్తికోసం రచయిత ఆర్.కృష్ణమూర్తితో కలసి 'కల్కి' (తమిళ వార పత్రిక) పత్రిక స్థాపించదలిచారు. అ నిధులకోసం ఆయన సావిత్రి చిత్రాన్ని నిర్మించారు. ఆపైన 'మీరా'ని కూడా ఆయనే నిర్మించారు. భర్త కోసమేనంట ఎంఎస్ సావిత్రి, మీరా చిత్రాల్లో నటించారు. 'మీరా'లో ఆమె పాడిన భజనలు వినితీరాల్సిందే.

ఇచ్చేవి. ఆమెను కోకిలతో పోల్చుతూ సమీక్షలు రాసేవి. "ఆనంద వికటన్" వారపత్రిక ఆమె కార్యక్రమాలకు మరింత ప్రాధాన్యత ఇచ్చేది.

'ఆనంద వికటన్' సీనియర్ ఎగ్జిక్యూటివ్ త్యాగరాజన్ సదాశివంతో జరిగిన పరిచయం సుబ్బులక్ష్మి జీవితాన్ని గొప్పమలుపు తిప్పింది. వారి పరిచయం ప్రేమగా మారింది. అతడు సంగీతప్రియుడు. స్వాతంత్ర్య సమరయోధుడు. మద్రాస్‌లో కాంగ్రెస్‌పార్టీ ప్రముఖుడు. ఎంఎస్‌ని రాజాజీ, గాంధీ, నెహ్రూలకు పరిచయం చేసింది అయనే. వారిద్దరూ 1940లో పెళ్లి చేసుకున్నారు. భార్యను కోల్పోయిన సదాశివానికి అప్పటికే ఇద్దరు పిల్లలు. 'వారి కులాంతర వివాహం రాజకీయంగా - సామాజికంగా పెద్ద దుమారం సృష్టించినట్టు' ఎంఎస్ జీవితచరిత్రను రాసిన టిజిఎస్ జార్జి చెబుతారు. భర్త ఇచ్చిన స్ఫూర్తితో సుబ్రహ్మణ్య భారతి, బంకించంద్ర ఛటర్జీ రచించిన జాతీయగీతాల్ని కూడా ఆమె నేర్చుకున్నారు. ఓసారి మద్రాస్ కార్పొరేషన్ రేడియోలో ప్రోగ్రామ్ చేయాల్సివచ్చినప్పుడు ఎంఎస్ తాను పాడే పాటల్లో ఓ జాతీయగీతాన్ని కూడా చేర్చారట. స్టేషన్‌వారు దాన్ని పాడేందుకు అనుమతించక పోవడంతో ఆ దంపతులు కార్యక్రమాన్నే వదిలిపెట్టేందుకు సిద్ధపడ్డారట.

సుబ్బులక్ష్మి నాలుగు సినిమాల్లో నటించారు. సినిమా షూటింగ్ వాతావరణం ఆమెకు కాసింత ఇబ్బంది కలిగించేదిట. అందుకే భర్త సలహా మేరకు సినిమాల్ని వదిలేశారు. సంగీతానికే పరిమితమయ్యారు. సెమ్మంగుడి శ్రీనివాస అయ్యర్‌కు ఆమె అభిమాన విద్యార్థి. ఆయనతో పాటు మరికొందరు గురువులవద్ద కూడా ఆమె సంగీతజ్ఞానాన్ని సముపార్జించారు. పండిట్ నారాయణ్‌రావ్ వ్యాస్ వద్ద హిందూస్తానీ సంగీతం నేర్చుకున్నారు. నిరంతరమూ తన గానకళకు సానబెట్టుకుంటూ దేశవ్యాపితంగా కచేరీలు చేశారు. ప్రత్యేకించి 50, 60 దశకాల్లో ఆమె నిరంతరమూ ప్రయాణాల్లోనే గడిపేశారు.

ఎంఎస్ ఎన్నో ప్రత్యేకతలు కలబోసుకున్న గాయని. నిత్యవిద్యార్థిని. సంగీతసాధనలో భాగంగా సంస్కృతాన్ని నేర్చుకున్నారు. 80 ఏళ్లు వచ్చిన తరువాత కూడా కొత్తకొత్త పాటల్ని నేర్చుకునేవారు. నిరంతరమూ సాధన చేయడం.. భాష ఏదయినా ఉచ్చారణ దోషాల్లేకుండా జాగ్రత్తపడటం.. ప్రతి పదమూ స్ఫుటంగా వినిపించేలా పాడటం.. లయపై పూర్తిస్థాయి పట్టు కలిగి వుండటం.. భావయుక్తంగా గానం చేయడం... ఇవన్నీ ఆ గానకోకిలను మహోన్నతస్థాయికి చేర్చాయి. గత శతాబ్దిలోనే గొప్ప కళాకారిణిగా నిలిపాయి. అయినప్పటికీ ఆమె పరీక్షకు వెళుతున్న విద్యార్థినిలా ప్రతి కచేరికీ సన్నద్ధమయ్యేవారు. శ్రోతల్ని రంజింపచేసి నూరుశాతం మార్కులూ కొట్టేసేవారు.



త్యాగరాజన్ సదాశివం "సంగీతం మోక్ష సాధనం" అన్న త్యాగరాజునే నమ్మారు. 'సంగీతజ్ఞానము భక్తి వినా సన్మార్గము' లేదన్న త్యాగరాజుబాటలో పయనించడమే ఉత్తమమని ఎంచారు. ఈ దృష్ట్యా ఆలాపన, కృతి, నెరవు (తమిళంలో 'నిరవల్' అంటారు) లలో భావానికి - భక్తికి పెద్దపీట వేయాల్సిందిగా ఎంఎస్‌కి సూచించారు. కచేరీల్లో సాంప్రదాయకంగా కనిపించే స్వరకల్పన తదితర అంశాల్ని కుదించమన్నారు. ఆయన సలహాల్ని ఎంఎస్ పాటించారు. భక్తిభావ సమ్మిళితమైన ఆమె కృతులు, భజనల్లో పామరులు సైతం తాదాత్మ్యం చెందారు. భక్తిసంగీతం కరుణరసాన్ని జాలువార్చుతుంది. కరుణరసం హృదయాన్ని ఆర్ద్రతకు లోనుచేస్తుంది. అందుకే భవభూతి 'ఏకోరసఃకరుణ ఏవ' అన్నాడు. కరుణరసాన్ని జాలువార్చే ఆమె గానంకోసం జనం దూరాభారాలను లెక్క చేయక హాజరవుతుండేవారు.

తనను అభిమానించే శ్రోతల్ని సంతోషపెట్టేందుకు ఆమె సదా సిద్ధంగా వుండేవారు. ఇక్కడో ఉదాహరణ చెప్పుకోవచ్చు. ఓసారి తంజావూరుజిల్లా అయలూరులోని ఓ ఆలయంలో ఆమె కచేరి చేశారట. ఆ కచేరికోసం ఓ గ్రామీణజంట ముప్పయి మైళ్ల దూరం నుండి నడిచి వచ్చిందిట. తీరా వాళ్లు ఆ దేవాలయానికి వచ్చేసరికి కచేరి ముగిసింది. ఎంఎస్ మరునాడు చీకటితోనే ప్రయాణం కట్టాల్సివుంది. అయినప్పటికీ ఆమె ఆ దంపతులను నిరుత్సాహపరచలేదు. కనీసం వాళ్లకోసం ఒక్క పాటయినా పాడుదామన్నారు. పక్కనున్న వారిలో ఒకరు అప్పటికే అర్ధరాత్రి అయిందని గుర్తు చేశారట. అయినా సుబ్బులక్ష్మి నవ్వుతూ పాట అందుకున్నారు. ఓ పాట పాడి వారిని సంతుష్టుల్ని చేశారు.

రాగానికి గొప్ప ఆకర్షణ శక్తి వుంటుంది. పువ్వుకు సౌరభమెలాగో రాగానికి ఆకర్షణా అలాగే! ఆ రాగం ఆమె గాత్రంలో వినడం గొప్ప అనుభూతే. గానకళకు అలంకారం అవశ్యం. భరతుని మాటల్లో చెప్పాలంటే అలంకారం లేని గానం 'చంద్రుడు లేని రాత్రితో సమానం.' 'గమకం' (స్వరాన్ని కర్ణపేయంగా కదిలించడం) గానానికి సొగసును పెంచే ఓ అలంకారం. ఆ గమకాల్ని ఆమె గానంలో వినడం ఓ హాయిగొలిపే అనుభూతి.

నియమబద్ధమైన కర్ణాటక సంగీతాన్ని ఉత్తర భారతీయులు కొరకరాని కొయ్యగా భావిస్తుంటారు. (కర్ణాటక సంగీతంతో పోల్చుకుంటే ఉత్తరభారతీయుల హిందూస్తానీ సంగీతానికి నియమాలు తక్కువే.) అలాంటి ఉత్తరభారత శ్రోతలు సైతం ఎంఎస్‌కి బ్రహ్మరథం పట్టారు. ఉత్తరాదిన కర్ణాటక సంగీతానికి ఖ్యాతి సంపాదించిపెట్టింది నిస్సందేహంగా ఎంఎస్సే. బడేగులామ్ అలీఖాన్, రోషనారా బేగం, రవిశంకర్, అంజాద్ అలీఖాన్, పండిట్ జస్‌రాజ్ వంటి హిందూస్తానీ సంగీత విద్వాంసులు ఆమె గానానికి తలయూచారు. తమ ఇష్టాన్ని ప్రకటించారు. 'సావిత్రి' పాటల రికార్డింగ్ కోసం కలకత్తాలోని ఓ





స్నేహశీలి

"ఎంఎస్‌తో సన్నిహితంగా మెలిగిన వాళ్లల్లో నేనూ ఒకర్తెని. ఆమె నాకు బాల్యం నుంచీ బాగా తెలుసు. మంచి స్నేహశీలి. ఇతరులూ బాగా పాడాలని, పైకెదగాలని మనస్ఫూర్తిగా కోరుకునేవారు. ఇతరుల పట్ల కూడని వ్యాఖ్యలు చేయడం నేనెరగను. ఎంఎస్ దంపతులు ఉదారస్వభావులు. నేనూ, నా భర్తా ఈ విషయం గురించి తరచూ చాలా మెచ్చుగోలుగా మాట్లాడుకునేవాళ్లం. ఆమెతో మాట్లాడుతుంటే కాలం తెలిసేది కాదు. ఎప్పుడూ సంగీతం గురించీ, అర్థవంతమైన అంశాల గురించే మాట్లాడేవారు. కపటం లేని మనిషి. పెద్దల్ని గౌరవించేవారు. సంగీతంతో పాటు ఇతరకళల్నీ ప్రేమించేవారు.

- ఎం.ఎల్. వసంతకుమారి (1960లలో)

స్టూడియోకి వెళ్లినప్పుడు కెఎల్ సైగల్, పన్నాలాల్ ఘోష్ (ఈయన తరువాతకాలంలో ఎంఎస్ నటించిన 'మీరా' చిత్రంలో వేణువు వాయించారు.) తదితరులు మళ్లీ మళ్లీ అడిగి తనచేత పాడించుకున్న విషయాన్ని ఆమె సంతోషంగా గుర్తుచేసుకునేవారు. "అప్పట్లో మంచి సంగీతం ఎక్కడున్నా ఆస్వాదించకుండా వదిలేది లేదు. మాలో మాకు పోటీ వుండేదే కాదు" అని చెప్పేవారు. ఎంఎస్ గానానికి మైమరచిపోయిన దిలీప్‌కుమార్‌రాయ్ ఆమెకు రవీంద్ర సంగీతాన్ని, భజన్లను ఎంతో ఇష్టంగా నేర్పారు. మీరా, తులసీదాస్ భజనల్ని తన కచేరిలో ఆమె తప్పక భాగం చేసుకునేవారు. తుకారం 'అభాంగ్'లు (భక్తిగీతాలు), సూరదాస్, నానక్‌ల గీతాల్ని కూడా తరచూ పాడుతుండేవారు. హిందూస్తానీ సంగీతకారుల వద్ద ఎప్పుడెప్పుడో నేర్చుకున్న 'ఖయాల్', 'ఠుమ్రీ'ల్ని (హిందూస్తానీ సంగీతప్రక్రియలు) కూడా సాధన చేస్తూ కచేరీల్లో అలపిస్తుండేవారు.

పదిభాషల్లో పాడి జాతీయ సమైక్యతా వారధిగా నిలిచారు ఎంఎస్. ఆమెలా పాశ్చాత్య ప్రపంచానికి కర్ణాటక సంగీత మాధుర్యాన్ని చవిచూపినవారు వేరొకరు లేరు. 1988లో రష్యన్ సంగీతకారులు, సంగీత శాస్త్రవేత్తలముందు ఆమె కచేరీ చేసినప్పుడు కరతాళధ్వనులు చాలాసేపు వర్షించాయట. ఆమె కచేరీ పూర్తి చేసి కారెక్కిన తరువాత కూడా వెలియనే లేదట! ఇక ఐరాస వేదికపై చేసిన కచేరి సంగతి అందరికీ తెలిసిందే.

ఎంఎస్ సేవాతత్పరత గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. ఆమెలా సేవా కార్యక్రమాల కోసం సంగీతాన్ని ధారవోసిన వారు మరొకరు లేరు. 1944లో రాజాజీ సూచన మేరకు కస్తూర్బా స్మారక నిధికోసం అమె అనేక కచేరీలు చేశారు. అది మొదలు జీవితాంతం ఆమె సంగీతం సేవాభావంతో ముడివడిపోయింది. 'నిధి చాలా సుఖం' కాదనుకున్న త్యాగయ్య బాటే ఎంఎస్ దంపతులకు శిరోధార్యమైంది. వివిధసంస్థల సహాయార్థం మొత్తం 240 సార్లు ఆమె గాత్రం నిధులు సమకూర్చింది. కచేరీలతో పాటు క్యాసెట్లు, రికార్డుల ద్వారా వచ్చిన పారితోషికం కూడా సేవాకార్యక్రమాలకే చేరింది. కోట్లాది రూపాయల ధనం సేవాకార్యక్రమాలకు జమ అయింది. ఈ సేవాదృష్టే ఆమె వ్యక్తిత్వానికి మరో అలంకారమై భాసిల్లింది. తన కృషిని ప్రశంసిస్తూ గాంధీజీ రాసిన లేఖను ఆమె అపురూపంగా దాచుకునేవారట. ఎంఎస్ డబ్బుకోసం పాడట్లేదని ఆమె భర్త సదాశివం ఓసారి వివరణ ఇచ్చారు. వాస్తవానికి ఆ సందర్భంలో ఆమె కుటుంబం ఆర్థికఇబ్బందుల్లో వుంది. కుటుంబ స్నేహితుల మాటల్లో చెప్పాలంటే వారు అద్దెఇంట్లో వుంటూ కూడా నమ్మశక్యం కానంత ధనాన్ని ప్రజాహిత కార్యక్రమాలకు ధారపోశారు. శాస్త్రవిజ్ఞాన - విద్య - పరిశోధక - మత - సేవాసంస్థలు ఆమె సహాయాన్ని పొందాయి. ఆమెకు ఎవ్వరైనా కానుక ఇవ్వదలిస్తే మూరెడు మల్లెపూలు చాలట! అది కాకుంటే ఫ్రెంచ్ పెర్‌ఫ్యూమ్. ఆ రెంటిలో ఏది ఇచ్చినా ఎంఎస్ నగుమోమును గనవచ్చు.



బడేగులామ్ ఆలీఖాన్ అన్నట్టు 'సుస్వరలక్ష్మి సుబ్బులక్ష్మి.' ఆమె అన్ని తరగతుల వారి అభిమానాన్ని చూరగొన్న కళాకారిణి. గాంధీజీ 'హర్ తుమ్ హరో' అన్న మీరా భజనను ఆమె గాత్రంలో మాత్రమే వినాలనుకున్నారు. దీంతో ఆవిడ ఆ పాట నేర్చి, దాన్ని రికార్డు చేసి మరీ గాంధీకి పంపారట. పండితులు, పామరులు, కళాకారులు, విమర్శకులు, ప్రముఖులు.. ఇలా ఇన్ని తరగతుల ప్రజల్ని అలరించిన కర్ణాటక సంగీతకారిణి మరొకరు వుండబోరు. కీర్తిశిఖరాలు ఎన్ని అధిరోహించినా ఇసుమంతైనా భేషజానికి పోని సహృదయ ఆమె. ఐదవ తరగతికి మించి చదవకపోయినా అంతర్జాతీయ ఖ్యాతినార్జించారు. గౌరవ డాక్టరేట్ డిగ్రీలు అందుకున్నారు. నేషనల్ ప్రొఫెసర్ అయ్యారు. అంతర్జాతీయ సంగీతమండలి గౌరవ సభ్యత్వం అందుకున్నారు. 'ఇందిరాగాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ది ఆర్ట్స్'కి ట్రస్టీగా పని చేశారు. 'సంగీతకళానిధి' పురస్కారాన్ని పొందిన తొలి మహిళగా అరుదైన గౌరవానికి పాత్రమైనారు. 'మెగసెసే'తో సహా అనేక విలువైన పురస్కారాలను పొందారు. 'భారతరత్న'మై వెలుగొందారు. వీటన్నింటి వెనుకా కీలకపాత్ర పోషించినవారు భర్త సదాశివం. ఎంఎస్ చెప్పినట్టు ఆమెకాయన 'స్నేహితుడు, మార్గదర్శి'. ఆమె ప్రతి కచేరి వెనుక పూర్తిస్థాయి పాత్ర ఆయనదే ఒక్క పాడటం తప్ప! చివరికి ఆమె ఏమి పాడాలో కూడా ఆయనే నిర్ణయించేవారు. ఎన్ని కృతులు పాడాలో.. ఏయే భాషాగీతాలు పాడాలో.. దేనికి ఎంత సమయం తీసుకోవాలో.. వంటి విషయాలతో కార్యక్రమాన్నంతా ఆయనే రూపొందించేవారు. పూవూ తావిలా అమరిపోయిన బంధం వారిది. 'ఓ మామూలు గృహిణిగా వుండిపోవడమే నా లక్ష్యం. కానీ ఆయనలోని నిబద్ధత నేను ఉన్నత శిఖరాలు అధిరోహించేందుకు కారణమైంది" అన్నారామె తన జీవితచరిత్రకారునితో. ఆమె కేవలం గృహిణిగా మిగిలిపోతే మనం ఎంత గొప్పగాయనిని కోల్పోయేవాళ్లమో కదా... ఈ విషయంలో మనం సదాశివాన్ని కొనియాడాల్సిందే. ఇప్పుడు ఎంఎస్ లేరు. ఆమె మిగిల్చిన సంగీతసంపద వుంది. అది సీడీలు, క్యాసెట్లరూపంలో మనకు దక్కింది. దాన్నే ఇప్పుడు మనం భద్రంగా దాచుకోవాలి. ఎప్పటికప్పుడు దాని నాణ్యతను పరిశీలించుకుంటూ ముందుతరాలవారికి అందించాలి. ప్రభుత్వం అందుకు పూనుకుంటుందని ఆశిద్దాం. ✤

వలస పక్షి

"ఏరా సుందర్రాజూ రేపు సాయంత్రం ఎక్కెయ్యడమేనా...?'

దీర్ఘాలోచనలోవున్న సుందర్రాజు పలకలేదు.

'ఒరే... హైద్రాబాదు నుంచి నువ్వు నాకేం తెస్తావురా...?

సుందర్రాజు కుంటిరాములు వంక ఉరిమి చూశాడు.

'ఒంటి మీద చొక్కాలాగూ ఇప్పి ఇచ్చేస్తాన్రా.. కుంటినాకొడకా... నువ్వు నా చెయ్యి లంకించుకొని రోడ్డు దాటినట్లే ఉంది నా జీవితం... మా యక్క ఎనకాలబడి ఆవిడెటుపోతే అటుపోవాలి తప్ప... మనకి ఎనకాముందూ ఏమయినా తెల్సా... భీమారందాటి ఒక్క అడుగెప్పుడైనా ఏసుంటే మనకి దిల్ ఉండేది... ఏదైనా... మన గోల్ హైదరాబాద్‌లో ఉద్యోగమే....

రాములు మొఖం చిన్నబోయింది.

ఇంజేటి శ్యాంబాబు

'అరే సుందర్రాజూ ఇంకోసారి నన్ను కుంటాడని నువ్వు అంటే నేనొప్పుకోను. అరే కాస్త కాలు వంకరగా ఉందనుకో.. అంతమాత్రంచేత కుంటాడినయిపోతాన్రా.. నువ్వు ఇలాగ నన్ను ఇన్‌సల్ట్ మాటలనటం మర్యాదగాదురా... మన పేటలో నీ అంత చదువు... సంస్కారం ఉన్నోడు ఇంకొకడు లేనేలేడని నిన్న కమ్యూనిటీ హాల్లోకూడా నే బల్లగుద్ది చెప్పా.... నువ్వయితే నన్నిట్టా.....'

రాములు గొంతు పూడుకుపోయింది.

సుందర్రాజు కంగారుపడ్డాడు..

'ఇదేంటిరా... వికారంగా ఏడుపు.. ఏహే... నేనేదో ఇసుక్కుంటూ అలా అన్నాగానీ... నువు నా ఎనకాల లేకపోతే మనం నడకే నడవం... అది సరేగానీ... మా అక్కయ్యను పంపించేసి నేనో పదిరోజులాడ వుండిపోతాన్రా... మా అమ్మకూడా అదే అంది.. 'మాయ్య గవర్నమెంటుద్యోగం కదా... ఏదో ఒక తావున నీకూ కుదురుస్తాడంటుందిరా'... పోనీ... ట్రై చేద్దామా అని చూస్తున్నా...' అన్నాడు సుందర్రాజు జిడ్డు కారుతున్న వెంట్రుకలు పైకి తీసుకుంటూ. నూనె చేతికి అంటుకొని చిరాకొచ్చిందతన్నికి.

'మాయక్క చేతికి నూనె సీసా ఇస్తే అది నూనె రాయదురా... తలని స్నానం చేయిస్తాది...' అన్నాడు సుందర్రాజు మొహం తుడుచుకొంటూ.

'నీకు ఉజ్జోగం రాకపోవటమేమిట్రా.... హైద్రాబాద్‌కి ఎళ్ళిన మనోళ్ళు ఒక్కడయినా చేతులూపుకుంటూ రాలా... ఏదో ఒక తీర్న జాబు సంపాదించేరు...'

"ఏందో...ప్రతోడూ స్టార్ హోటల్‌లో పనంటాడ్రా... ఏదో డౌటు నాకు...ఆడ కప్పులు కడుగుతున్నారో... డేగిసాలు తోముతున్నారో... ఒక్కడు కూడా చెప్పి చావడు కదా...' అన్నాడు విసుగ్గ సుందర్రాజు.

'సర్లేరా... మరి నేనికపోతా... ఉజ్జోగం సంపాదించాకే భీమరం బస్సెక్కుతాననుకో...'అన్నాడు కుంటి రాములు ధైర్యం ఇస్తున్నట్లుగా చెయ్యందిస్తూ....

'మనకి ఉద్యోగం వచ్చి తీరాల' అనుకున్నాడు సుందర్రాజు ఇంటికి నడుస్తూ....

***

'ఒరే సుందర్రాజూ... జాగ్రత్తగా ఇను... ఆడ మనం ఎల్లుండి కూడా ఉంటాం....పాస్‌పోర్ట్ రెన్యూవల్ అయిపొయ్యాకే మనం తిరిగొద్దాం. ఆడకి వెళ్ళిన వెంటనే పని అయిపోయిద్దా..నువు మాత్రం మీ మేనత్తతో ఇయ్యాళా రేపూ... ఉంటామని అనబాక... అసలు ఆళ్ళే ఉండమని మరేద చెయ్యాలా... ఉండిపోదాం...' అన్నది సుజ్ఞానమ్మ సుందర్రాజుతో. బస్సు హైద్రాబాద్ వైపు వేగంగా వెళ్తోంది.

చీకట్లో వెనక్కి పరుగెత్తుతున్న లైట్లని, చెట్లనీ చూస్తూ సుందర్రాజు ఊ... కొట్టాడు. ఈదురగాలి మొఖానికి కొడుతోంది. అతనికి అది కలో నిజమో తెలియడం లేదు. తనేంటి... హైద్రాబాద్ ప్రయాణం హైటెక్ బస్సులో... వేగంగా వెళ్తన్న బస్సులోంచి చీకట్లో ఏమీ కనబడకపోయినా బయటకు చూస్తూనే ఉన్నాడు. కళ్ళు మూతలు పడుతున్నప్పుడల్లా 'వనస్థలిపురం' అని కండక్టర్ కేక పెట్టినట్లుగానే వుంది. ఎందుకు టెన్షనో అర్థం కాదు... తీరా బస్సు దిగే నరికి కళ్ళు ఇనకపోసినట్లు మెరమెరలాడుతున్నాయి.

చీకటిచీకటిగావున్న దారిలో పదడుగులు వేశాక కానీ శరీరం కంట్రోల్‌లోకి రాలేదు. రోడ్డు ప్రక్కన చెట్లూ, కంపలూ పెరిగిపోయి అదేదో అరణ్యంలా ఉంది. వెంప డొంకదారిన స్మశానం వక్కనుంచి నడిచిపోతున్నట్లుంది కానీ హైద్రాబాద్ నగర వీధుల్లో హాయిగా చేతులూపుకుంటూ నడిచినట్లులేదు. రెండు మైళ్ళు కాలనీలోకి నడిచి 'రామారావు, డిప్యూటీ డైరెక్టర్, వ్యవసాయ శాఖ' అని ఉన్న బోర్డు ముందర ఆగి బెల్లు కొట్టేసరికి సుందర్రాజు కాళ్ళు తేలిపోయాయి.

సుగుణ తలుపుతీసింది.

"ఏం... సుజ్ఞానం బావున్నావా... బస్ రోడ్డు మీదే ఆపారా... అదే అనుకొంటున్నా... చీకట్లో ఇల్లు గుర్తుపడతారా లేరా అని. ఒరే సుందర్రాజూ...ఎంట్రోయ్... బాగా పొడుగయి పోయావే.... బాగున్నావా... లోపలికి రండి ముందు..." మాట్లాడుతూనే హాల్లోకి నడిచింది సుగుణ.

ఇంట్లో మూల కనిపించిన టీవీ చూడగానే సుందర్రాజు మబ్బు తేలిపోయింది. హాల్లో సోఫాలు, గోడనానుకుని మంచం ఉన్నాయి. వెళ్ళి మంచంపైన కూర్చుని గోడకి చేరగిలపడ్డాడు. అప్పటిదాకా వున్న సంకోచం మేనత్త సుగుణ మొఖం చూడగానే పోయినట్లయింది.

'సురేష్‌గాడు లేడాంటీ...' అన్నాడు.

సుగుణ చురుగ్గా చూసింది సుందర్రాజుని.

'సురేషా.... బాబు ఎనిమిదింటిదాకా లేవడు. రాత్రి పదకొండు వరకూ స్టడీ అవర్స్ ఉంటాయి కదా....' అంది.

ఆవిడ 'సురేషా' అన్న తీరు.... 'బాబు' అని సురేష్‌ని గౌరవంగా మాట్లాడటం... తనవేపు చురుగ్గా చూడటం... సుందర్రాజు దృష్టి పట్టేసింది.

'సురేష్‌గాడు అనటం' ఈవిడకి తప్పయిందేమోననిపించింది. సంవత్సరం నాడు సెలవుల్లో సురేష్‌గాడు వెంప వచ్చినపుడు వాడి కబుర్లు, వాడి ఎక్స్పీరియన్స్ గుర్తొచ్చాయి సుందర్రాజుకి. వాడున్న నాలుగు రోజులూ కుంటిగాడితో సహా వెంప మూకంతా

విన్నది వాడి మందుతాగే ఎక్స్‌పీరియన్సూ, వాడి వల్లోపడ్డ అమ్మాయిలూ, రహస్యంగా ఇంటర్‌నెట్ నుంచి డౌన్‌లోడ్‌చేసిన గుడ్డల్లేని బొమ్మలు గురించి విన్నారు.

ప్రభాకర్ తేల్చి చెప్పాడు కూడా.

'అరే సుందర్రాజూ... మీ మామ కొడుకు నిజ్జంగానే ఎక్స్‌పర్ట్‌రా... ఈడికి చదువు తప్ప అన్ని విద్యలూ తెల్సు... ఓరి మామా ఈడితో పాటు తిరిగి నువ్వ ఉజ్జోగం కోసం ఎతికితే నీకు దొరికేది ఉజ్జోగం కాదు... ఎయిడ్స్...' అని.

సురేష్ వేసుకొన్న జీన్సూ... టీషర్టూ... మెళ్ళో గొలుసూ.... జేబులో డబ్బూ.... వాడికి తెచ్చిపెట్టిన మర్యాద ఇదే...

సుందర్రాజు నెమ్మదిగా దిండు మీదికి తలవాల్చాడు. బస్సెక్కే ముందర అమ్మ చెప్పిన జాగ్రత్తలు గుర్తొచ్చాయి.

'ఆడ... మాయత్తా, మామా అని అతిచనువద్దులే సుందర్రాజూ... తాహతు ఎరిగి మసలుకోవాలి... ఆడు నాకు అన్నేగావచ్చు... ఏనాడూ ఆడకూతుర్నని పిలిచి ఓ చీరెజాకెట్టూ పెట్టలేదు.... నా బిడ్డలు కరువుకష్టాల్లో వున్నారని ఆదుకోలేదు... నేనూ అడగలేదు. ఉందోలేదో ఏదో ముద్దతిని ఇంతవాళ్ళ య్యారు. దేవుడు తిన్నగా చూశాడనుకొంటా... ఆడ... ఒద్దిగ్గావుండి ఉద్దోగం చూసుకో...ఎనక.. తమ్ముడూ, సెల్లే, మీ నాయిన్నీ... అందర్నీ గుర్తు పెట్టుకో... మీ నాయిన మాట ఇంటున్నావా... ఏందో సెయ్యి నెప్పంటాడు. మాట గబగబా వస్తావుంది... ఆయనకి బాగా వుండట్లే... కాస్త మంచిగా తిని ఇశ్రాంతిగా వుంటే ఆరోగ్యం బాగుండేదేమో... ఎక్కడ చెప్పు... పగలంతా స్కూలు... రాత్రిళ్ళు ప్రైవేటు పిల్లలూ.. ఏదో కొంప మునుగుతుందని బయ్యంగా ఉందిరా... ఆడ ఉద్దోగం చూసుకో నాయినా...'

సుందర్రాజు కళ్ళు మూసుకున్నాడు. చార్మినార్ నుంచి గోల్కొండ దాకా... ఇంత పెద్ద పట్నంలో నాకు ఉద్యోగం దొరకదా... నిముషాల పని... అమ్మకి బయ్యంకానీ.. భీమారం కాలేజీలో మనం కాలేజ్ ఫస్ట్... పన్నెండొందలు మెరిట్ స్కాలర్‌షిప్... మనకేమిటి మనం రాజా...

సుందర్రాజుకి నిద్దరొచ్చేసింది.

* * *

డైనింగ్ టేబుల్‌మీద దరువేస్తున్నాడు సురేష్.. కళ్ళెగరేసి ఎట్లావుందన్నట్లు సుందర్రాజు వైపు చూశాడు... రాత్రి ఇద్దరూ రహస్యంగా పడీపడీ చూసిన సీడీ గుర్తొచ్చింది సుందర్రాజుకి. వంట్లోకి వెచ్చని ఆవిరొచ్చింది. నాలుగ్గంటలకే 'నల్లా వస్తుంది చూడమని' అత్త లేపేయడంతో తేలిపోయిన నిద్ర మళ్ళా కళ్ళమీదకు గమ్మత్తుగా వచ్చి వాలుతోంది. ఉద్యోగ ప్రయత్నాలు కాదుకానీ గంటల తరబడి బజార్లు కొలవడం, రికమెండేషన్లకోసం మావయ్య ఆఫీసుచుట్టూ ప్రదక్షిణలు చేయడం కాళ్ళు అరిగిపోయేంతయ్యింది. బజారులన్నీ సిటీ బస్సులూ, ఆటోల మయం. జేబులో చిల్లికానీ ఏదీ...? రేపియన్నీ మన రాజ్యానికి ఎల్లలనిపించబట్టిగాని లేకపోతే వచ్చిన వారానికే పిక్కబలం చూపిచ్చి ఊర్లో వాలిపోకపోయినానా... కుంటిగాడు ఏం చేస్తున్నాడో... ఏమో.. వాడికి చెప్పాల్సిన కబుర్లతో బుర్ర కిక్కిరిసిపోతోంది. బ్లూఫిలిమ్ సంగతి చెబితే ఆడు ఏకంగా మూర్ఛపోతాడో... ఏమో... పిచ్చి కలర్స్... ఆ.... ఆడ సొంత ఊళ్ళో ఏముంది కనుక? కంచం నిండా మింగడం.. వంతెన మీద కబుర్లకి దేకటం తప్ప....

టేబుల్ మీద ప్లేట్లూ, పచ్చళ్ళూ సర్దుతున్న జానకి వేపు చూపిస్తూ మళ్ళీ కళ్ళెగరేశాడు సురేష్. సుందర్రాజు దొంగదొంగగా జానకివైపు చూశాడు. రాత్రి బ్లూఫిల్మ్‌లో అమ్మాయిలాగా జానకి కనిపించలేదు. రేగిపోయిన జుట్టూ... పాచిమొహం... అరిగిపోయి అరిగిపోయి వదులుగావున్న పంజాబీ డ్రెస్సులో ఆ అమ్మాయి ఆడపిల్లలాగే కనిపించటం లేదు... సురేష్ వంక చూశాడు. సురేష్ ఆ అమ్మాయి చెస్ట్ వంకే చూస్తున్నాడు... సుందర్రాజుకి వళ్ళు జల్లుమంది.

'ఏవిట్రా.... పచ్చడి వద్దా...' సుగుణ విసుగ్గా అంటోంది.

సుందర్రాజు ఉలిక్కిపడ్డాడు. పళ్ళెంలో రెండే రెండు ఇడ్లీలు. సుగుణ ఒక స్పూన్‌తో పచ్చడి వేసింది.

సురేష్‌ను 'ఇంకా రెండు తిన్రా... స్పెషల్ క్లాసుకి పోయి వచ్చేసరికి తొమ్మిద్దాటుతుంది... ఇంకా అన్నం ఎప్పుడు తింటావూ...' అంటోంది ఆమె. తను ఈ రెండిడ్లీలతో ఏకంగా రోడ్డున పడి మైళ్ళకు మైళ్ళు నడిచి మామయ్య ఆఫీసుకు పోవాలి. ఆ విషయం ఈమెకు గుర్తొస్తే ఎంత బావుండు.... సుందర్రాజుకి హటాత్తుగా ఆపుకోలేని దిగులేసింది... ఎంత ఆకలిగా ఉందో... ఈ వెధవ రెండిడ్లీ స్పూను పచ్చడితో ఎలా ఆకలి తీరుతుందో... కడుపునిండా తిండి తిని పదిహేను రోజులయ్యింది....

'మొఖం కడుక్కోరా సుందర్రాజూ... ఎంత సేపు అల్లా మంచం పట్టుకు వేలాడతావూ....' అని అమ్మ అరిస్తే... 'అన్నం అయ్యిందా... అన్నం అయ్యిందా... ' అని తను అడగటం గుర్తొచ్చింది. అమ్మ నవ్వు మొఖమూ గుర్తొచ్చింది.

'నానీ... అన్నాయి కంచం కడిగి... అన్నమూ, చారూ పోసి వాడిముందు పెట్టవే... వాడు మొఖం కడుక్కోవటంతోటే....'

సుందర్రాజు కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. తలవొంచుకుని గబగబా రెండిడ్లీలు నోట్లో కుక్కేసికున్నాడు...

'జానకీ... కూర తరిగేవా... అదేమిటో... ఇదివరకూ వండిన కూర సాయంత్రందాకా అట్లానే పడుండేది. ఇప్పుడు చూడు ఓ పూట కూడా అందరికీ చాలదు... కిలో వంకాయలూ తరిగినా... గిన్నె మింగేస్తుందేమో...'

అత్తయ్య తననే అంటున్నట్లు అనిపించింది సుందర్రాజుకి.

ఇల్లంతా ఇరుగ్గా ఊపిరి ఆడనట్లు అనిపించింది. ఇదే మనుషులు వెంపలో తమ రెండు గదుల ఇంట్లో అమ్మ చేసిపెట్టిన మామూలు అన్నం, కూరా ఎంత అప్యాయంగా తిన్నారు... ఎన్ని మాటలు చెప్పారు. వాళ్ళు వచ్చింది తనను చూసేందుకే అనుకుంటుంది అమ్మ. ఇప్పుడు అత్తయ్య చెప్పేదాకా తెలియదు. కొబ్బరికాయ దింపుకి... ప్రతి సంవత్సరం తమ పొలంలో దిగుబడి లెక్కలకే వాళ్ళు రావటం.. కొబ్బరి పీచు దగ్గరి నుంచి అమ్మ లెక్కలు చెప్పటం... అన్నగారి పొలం కోసం చాకిరీ, బాధ్యతా నెత్తిన వేసుకుంటే, అమ్మకి దక్కింది రాలిపోయిన కొబ్బరి మట్టలు... గట్టుపైన పెరిగిన గోంగూర... తోటకూర...

సుందర్రాజు చేయికడుక్కొని గబగబా బయటికి వచ్చాడు.

సుగుణ చెబుతోంది...

'సుందర్రాజూ... ఇప్పుడే వెళ్ళాలా... కాస్సేపుండు.. జానకీని ఇల్లు సర్దమన్నాను. నువ్వు ఆ ఫ్యాన్లూ, కిటికీలు తుడిచిపెట్టు... దానికి కాళ్ళు అందవు.. ఎన్నాళ్ళయ్యిందో ఇల్లు బూజులు దులిపి.. కిటికీలు నీళ్ళతో కడుగురోయ్... కూరలు తెచ్చి, చిల్లర టేబుల్‌మీద పెట్టు... ఏమిటో ఈ మధ్య ఎక్కడపెట్టిన డబ్బులు అక్కడే మాయమవుతున్నాయ్.. కిటికీలూ... గోడలూ... మింగేస్తున్నాయో ఏమో.. ఏమిటో బాబూ.. ఖర్మ.. తనకుమాలిన ధర్మమంటే ఆయన వింటాడా...'

సుందర్రాజు చెవులు రెండుచేతులతో మూసుకున్నాడు.

నిన్న సాయంత్రం స్టార్ హోటల్‌లో సురేష్‌గాడి పక్కన నిలబడి 'బఫే మేనేజర్' డిగ్రీ గురించి నవ్వుకోవటం గుర్తొచ్చింది.

'ఓర్నీ... ఇదేదో పెద్ద ఉద్యోగం అనుకొన్నా... తినిపారేసిన కంచాలు లెక్కెట్టుకోవడమా... మనం డిగ్రీ ఏడిసి చివరికి ఇదా...' అనటమూ గుర్తొచ్చింది.

ఇల్లు తుడుస్తున్నా... కిటికీలు కడుగుతున్నా... ఇదే మెదిలింది సుందర్రాజు మనసులో.. చదువుకున్న కొడుకు అన్న ప్రేమతో తనకి పనిచెప్పకుండా... దూరం నుంచి బక్కెట్లతో నీళ్ళు మోస్తూ ఆయాసపడే నాన్న గుర్తొచ్చాడు.

'మా అబ్బాయికి వాళ్ళ మాయ్య ఉద్యోగం చూపిత్తాడు. అక్కడ ఐద్రాబాద్‌లోనే వాళ్ళ మాయ్యంత పెద్దాడయిపోవాలి...మేవూ... తర్వాత అక్కడ చిన్నిల్లు కొనుక్కుంటే... ఆడపిల్లలు పెళ్ళిళ్ళు చేసేస్తే... మా అబ్బాయితోనే...'

సుందర్రాజుకి ఏడుపొచ్చింది.

'ఫర్వాలేదమ్మా ఆడపిల్లలు పెళ్ళిళ్ళు చేసేద్దాం... నేను ఉద్యోగం చేస్తాగా... మావయ్యలాగే అక్కర్లేదమ్మా.. సుందర్రాజులాగా ఉద్యోగం చేస్తా. స్టార్ హోటల్లో కంచాల్లెక్కెట్టే ఉద్యోగంలో ఇవ్వాళే చేర్తా... మావయ్యలాగా అయిపోవాలని ఈ ఇంట్లో వుంటే అసలు నేనే మాయమైపోతానమ్మా...' అనుకున్నాడు.

జానకి చేతులు తుడుచుకుంటూ వచ్చింది.

'వస్తానయ్యా ఆలస్యం అయిపోయింది' అంది తలొంచుకుని. సురేష్‌తో పాటు సుందర్రాజు తనవేపుచూసే చూపులు చూస్తే చాలా భయం ఆమెకు.

సుందర్రాజు జానకి దగ్గరకు వచ్చి నిలబడి 'జానకీ... నేను రేపొద్దున్నే వెళ్ళి పోతున్నా... నాకు ఉద్యోగం దొరికింది...'

'ఏడుంటావయ్యా..' అంది జానకి ఆశ్చర్యంగా. 'చింతల్‌బస్తీలో నా ఫ్రెండ్స్ వున్నారని చెప్పేనే... వాళ్ళతో'

'అదే గదయ్యా... బంజారాహిల్స్ దగ్గరుండేది... ఆడ మురికి వాసనయ్యా... నీళ్ళురావు... నువ్వుండలేవు'... అంది.

సుందర్రాజు ఆ అమ్మాయి వంక ప్రేమగా చూశాడు.

'పోన్లే జానకీ.... నేనే ఫ్యాన్లూ.... ఇల్లూ కిటికీలు తుడవక్కరలేదుగా... ఎవరినీ ఇబ్బంది పెట్టక్కర్లేదుగా... మేమంతా కలిసి వండుకుతిని, గిన్నెలు తోముకుంటే చాలు..'

జానకి మొహంలోకి నవ్వుకళ వచ్చింది.

'బాగుందన్నా... ఉద్యోగానికి ఎళ్ళిపో...' అంది జానకి.

సుందర్రాజుకి వళ్ళు జలదరించింది. 'అన్న' అన్న పిలుపుతో.. ఇన్నాళ్ళనుంచి జానకి తనని 'అన్నా' అని ఎందుకు పిలవలేదో అర్థం అయ్యిందతనికి.

'జానకీ అంత దూరం ఏం నడుస్తావూ... బస్‌లో వెళ్ళరాదూ...' అన్నాడు జేబులు తడుముకుంటూ. జేబులో ఒక్కపైసా అయినా లేదు.

జానకి నవ్వింది.

'నేనెళతానన్నా...నన్ను గుర్తెట్టుకో...' అంది.

పెళ్ళిళ్ళ ప్రకటనలు

డాక్టర్ ముదిగంటి సుజాతారెడ్డి

ఆ రోజు పత్రిక చదువుతున్నాన్నేను తీరికగా. గాలిదుమారంలా లోపలికి వచ్చింది లలిత. సోఫాలో కూల బడింది.

"ఏం చదువుతున్నావే అంత దీక్షగా" అడిగింది.

"పెళ్ళిళ్ళ ప్రకటనలు చదువుతున్నాను-" నవ్వాన్నేను.

"పెళ్ళిళ్ళ ప్రకటనలా? అవీ చదువదగ్గవేనా"? ఆశ్చర్యపోయింది లలిత.

"పెళ్ళిళ్ళ ప్రకటనలు పత్రికల్లో చదవటం నాకో హాబీ అనుకో"!

"ఏం ఏమైనా సంబంధాలు కుదిరించాలని చూస్తున్నావా? లేకపోతే ఎవరికొరకైనా సంబంధాలు వెతుకుతున్నావా? నాకు తెలిసినంత వరకు మీ ఇంట్లో పెండ్లి కావల్సిన వయస్సు వాళ్ళెవరూ లేరే!" అంది లలిత.

"అది కాదే... పత్రికల్లో పెళ్ళిళ్ళ ప్రకటనలు చాలా విచిత్రంగా వుంటాయి. ఒక్కొక్క పత్రిక మూడు నాలుగు పేజీల్లో ఆదివారం నాడు పెళ్ళిళ్ళ ప్రకటనలను ప్రచురిస్తాయి. కొన్ని పత్రికలు రోజూ ఒక పేజో, అర పేజో పెళ్ళిళ్ళ ప్రకటనలను ఇస్తాయి. ఈ ప్రకటనలన్నీ చదివితే మన కులవ్యవస్థ సంప్రదాయం ఉపకులాల మీద కూడా వీడని నమ్మకాలు, నక్షత్రాలు, జాతకాల మీద చావని విశ్వాసాలు, ఆహారనియమాల మీదున్న మోజులు-భాష ప్రాంతాలు-పట్టణాల మీద వున్న ప్రేమలు... అన్నీ అర్థమౌతాయి..." లలిత వైపు చిరునవ్వుతో చూశాన్నేను.

"ఓహో! సమాజశాస్త్ర అధ్యయనం చేస్తున్నావా!" పెద్దగా నవ్వింది లలిత.

"లల్లీ నువ్వెప్పుడైనా చదివావే పెళ్ళిళ్ళ ప్రకటనలు !"

"ఏమోనే! ఎప్పుడో మా ఆడబిడ్డకు పెళ్ళి కావల్సివున్నప్పుడు చదివేదాన్ని. చివరికి ఏ పెళ్ళిళ్ళ పేరయ్యో తెచ్చిన సంబంధం కుదిరింది. మళ్ళా నేనా ప్రకటనల వైపు కన్నెత్తి చూడలేదు".

"ఇప్పుడా పెళ్ళిళ్ళ పేరయ్యలు రంగం నుంచి తొలగి పోయారు. పత్రికల్లో ప్రకటనలు, మ్యారేజీ బ్యూరోలు, ఇంటర్నెట్ సమాచారాలతో పెళ్ళిళ్ళు అవుతున్నాయి". అన్నాన్నేను చేతిలోని పత్రికను పక్కన పెడ్తూ.

"అవును సుశ్రీ ! ఈ పత్రికల్లోని పెళ్ళిళ్ళ ప్రకటనలతో పెళ్ళిళ్ళు జరుగుతున్నాయంటావా!" అనుమానంగా వుంది లలిత గొంతు.

"ఈ ప్రకటనలతో పెళ్ళిళ్ళు కాందే ఇంతమంది ఇన్ని పత్రికల్లో ఇన్ని పేజీలను దండుగ సంబంధాలు కుదుర్చుకుంటేనే కద ఈ ప్రకటనల పేజీలకు ఇంత గిరాకి".

"ఏమోనబ్బ! ముక్కూ మొఖం తెలియని వాళ్ళతో ఏం పెళ్ళిళ్ళో ! అవి ఎంతవరకు విజయం సాధిస్తాయో!" మళ్ళా అనుమానమే లలిత గొంతులో.

"ముక్కూ మొఖం తెలియకపోతేనేంటే! ఎంత ఎత్తు, రంగు ఏమిటి అభిరుచులేమిటి, చదువులేమిటి, ఉద్యోగాలేమిటి, తల్లిదండ్రుల గోత్రాలు, సంప్రదాయాలు అన్ని వివరాలు ఆ ప్రకటనల్లో వుంటున్నాయి కద! తర్వాత ఉత్తరాలు రాసి ఫొటోలు చూసుకొని కలుసుకొని సంబంధాలు కుదుర్చుకుంటారు" అన్నాన్నేను.

"ఏమోనమ్మా! అన్నీ ప్రత్యక్షంగా చూసుకున్న పెళ్ళిళ్ళే ఈ రోజుల్లో విజయవంతం కావటం లేదు. విడాకుల వరకు పోతున్నాయి. మరి ఈ ప్రకటనలతో ఏమవుతాయో!" ఇంకా అనుమానం వదలటం లేదు లలితను.

"సరేనే నువ్వన్నట్లుగా పెళ్ళి అనేది భవిష్యత్తులో ఏమౌతుందో తెలియని 'రిస్క్' అనుకో. కాని పెళ్ళిళ్ళ ప్రకటనలకు పెళ్ళిళ్ళు అవుతాయంటే ఏమో ఏమవుతుందో అటువంటి పెళ్ళిళ్ళ వల్ల అనుకోవటం మాత్రం నీ భ్రమ లల్లీ! ఇటు చూడు ఈ ప్రకటనలు ఎన్ని వందల సంఖ్యలో వున్నాయో. ఇవన్నీ ఉత్తగనే పత్రికలో ఇచ్చారంటావా!" పత్రికను తీసి లలితకు చూపించాన్నేను.

మళ్ళా లలిత అనుమానంగానే పత్రిక వైపు చూసింది. నేను నవ్వాను.

"సరే! నీకు నమ్మకం లేకపోతే వదిలెయ్యి. కాని ఈ ప్రకటనలు చదవటానికి మాత్రం చాలా ఇంట్రెస్టింగ్‌గా వుంటాయి. "వధువులు కావాలి" అన్న ప్రకటనలన్నీ ఒకవైపు, "వరుడు కావాలి" అన్న ప్రకటన మరోవైపు. అంటే వెతుక్కునే వాళ్ళకు సులభంగా వుంటుంది. ఇకపోతే మళ్ళా మతం, ప్రాంతం, కులం విభాగాలతో ప్రకటనలు వేరువేరుగా వుంటాయి. అంతేకాదు డాక్టర్లు ఇంజనీర్లు వృత్తిననుసరించి మరో విభాగం! కాని వధువు కోసం వేసే ప్రకటనలన్నిటిలో మాత్రం వధువు తెల్లగా వుండాలనే కోరిక మాత్రం తప్పకుండా వుంటుంది. చదువు సంధ్యలు, ఉద్యోగాలు పోగా ఆడపిల్లలలో ఈ లక్షణాలు మాత్రం అదనంగా వుండాలి!..." నేను ముగించక ముందే –

"అందమంటే ఎట్లా నిర్ణయిస్తామే! అందానికి ఏం కొలబద్దలుంటాయి!" అనుమానం వ్యక్తం చేసింది లలిత.

"సరే! వాళ్ళు 'ఫెయిర్ అండ్ బ్యూటిఫుల్' అని ప్రకటనలో ఇస్తారు. ఇంత ఎత్తు ఇంత వయస్సు కావాలంటారు. భార్య చనిపోయినతను కూడా కన్నె వయస్సులో వున్న పెళ్ళి కూతుర్నే కావాలంటాడు. ఇవిగాక కొందరు పెళ్ళి అని అనరు. కేవలం భాగస్వామిని పార్ట్‌నర్ కావాలనో 'కంపానియన్' కావాలనో ప్రకటనలిస్తారు. అట్లా ఈ పెళ్ళిళ్ళ ప్రకటనలు చాలా విచిత్రంగా మనోభావాలను, మనస్తత్వాలను, మన సమాజం నిర్మాణాన్ని పట్టించేవిగా వుంటాయి. అందుకే నాకు పెళ్ళిళ్ళ ప్రకటనలు చదవటం ఓ హాబీ అయిందనుకో!" చిరునవ్వుతో లలిత వైపు చూశాన్నేను. ఈ విశ్లేషణతో లలిత ముఖం విస్మయం చెందినట్లుగా కన్పించింది నాకు.



గుణం ప్రధానం

పి.ఎం.సుందరరావు

ఒక అడవికి సింహం రాజుగా వుండేది. అది జంతువులు, పక్షులు అన్న తేడా లేకుండా అన్నిటినీ సమానంగా చూస్తూ, మంచి పరిపాలనా దక్షతగలదిగా పేరు తెచ్చుకుంది. దానికి లలిత కళలంటే చాలా ఇష్టం. ఏదన్నా పక్షిగానీ, జంతువుగానీ పాట పాడుతున్నా, నాట్యం చేస్తున్నా ఆసక్తిగా చూసేది. వాటినెంతో మెచ్చుకునేది.

సింహానికి మంత్రి తోడేలు. కోతి న్యాయ సలహాదారు. ఆ కోతి జబ్బు చేసి చనిపోయింది. దాని స్థానంలో మరో జంతువును న్యాయ సలహాదారుగా నియమించాలని సింహం, తోడేలు నిర్ణయించాయి. తగిన దాని కోసం అడవిలో దండోరా వేయించాయి. పౌర్ణమినాడు పరీక్ష వుంటుందని కూడా చెప్పించాయి.

చూస్తుండగానే పౌర్ణమి రానే వచ్చింది. ఆ రోజున కొన్ని జంతువులు, పక్షులు పులి స్థావరం దగ్గరకు వచ్చాయి. సింహం, తోడేలు వాటి శక్తి, సామర్థ్యాలను పరీక్షించాయి. చివరకు ఓ కోతి, ఎలుగుబంటు సమవుజ్జీలుగా నిలిచాయి.

అప్పడు సింహం వాటితో “మీ ఇద్దరి శక్తి, సామర్థ్యాలు సమానంగా వున్నాయి. ఇంకా ఏవైనా అదనపు అర్హతలు వుంటే చెప్పండి. వారికే ఈ పదవిని ఇస్తాం' అని చెప్పింది.

ఎలుగుబంటు మౌనంగా వుండిపోయింది. కోతి తనకు నాట్యంలో ప్రవేశముందని చెప్పింది. తనకొచ్చిన నాట్యాన్ని ప్రదర్శించి సింహాన్ని మెప్పించింది. వెంటనే సింహం, 'న్యాయ సలహాదారు పదవి నీకే అప్పగిస్తున్నాను' అంది ఆనందంగా.

మంత్రి తోడేలు కల్పించుకొని, 'ఆగండి మృగరాజా! రెండు రోజుల దాకా మంచి ఘడియలు లేవు. మూడోరోజు కోతికి ఈ పదవిని అప్పగిద్దాం' అంది. సింహం సరేనంది.

రెండో రోజు సింహం, తోడేలు అడవిలో సరదాగా తిరుగుతున్నాయి. ఓ చెట్టు కింద గుంపుగా వున్న జంతువుల మధ్య కోతి ఏదో మాట్లాడటం గమనించింది తోడేలు.

“మృగరాజా! ఇక్కడేదో గూడుపుఠాణీ జరుగుతోంది. చెట్టు చాటున వుండి గమనిద్దాం” అంది సింహంతో. సింహం అందుకు ఒప్పకుంది. ఆ రెండూ చెట్టు చాటున దాక్కొని గమనించసాగాయి.

“మీరంతా ఇక నుండి నాతో జాగ్రత్తగా వుండండి. మన రాజు సింహం దగ్గర నేను న్యాయ సలహాదారుగా వుండబోతున్నాను. కాబట్టి నేను ఏది చెప్తే అది సింహం వింటుంది. కాబట్టి మీరంతా ఇక నాకు ఇష్టమైన ఆహార పదార్థాలు తెచ్చిపెట్టాలి. నిత్యం కానుకలు సమర్పించుకోవాలి. లేకుంటే మీ గురించి సింహానికి చెడుగా చెప్పి అడవి నుండి బహిష్కరించేలా చేస్తాను” అని హెచ్చరించసాగింది కోతి.

కోతి బుద్ధిని గమనించిన సింహం కోపంగా చెట్టు చాటు నుండి వచ్చింది. “నీ బుద్ధి ఏమిటో తెలుసుకున్నాను. నీలాంటిది ఈ అడవిలో నివసించడానికి పనికిరాదు. నిన్నే ఈ అడవి నుండి బహిష్కరిస్తున్నాను'' అని గర్జించింది. కోతి భయంతో పరుగులు తీసింది.

అప్పడు తోడేలు, “మృగరాజా! మొదటే ఈ కోతి బుద్ధి మంచిది కాదన్న అనుమానం నాకు కలిగింది. అందుకే దీని గురించి తెలుసుకోవాలని ఘడియలు మంచివి కావని వాయిదా వేశాను. నిజానికి మనకు అలాంటి మూఢాచారాలు లేవు. ఎలుగుబంటు మంచి బుద్ధిగలది. అదే న్యాయ సలహాదారు పదవికి తగినది” అని చెప్పింది.

నిజం తెలుసుకున్న సింహం, “నువ్వు చెప్పింది నిజమే. ఇలాంటి పదవులకు శక్తి సామర్థ్యాలతోపాటు గుణం కూడా ప్రధానం” అంది. అప్పడే ఎలుగుబంటును న్యాయ సలహాదారుగా నియమించింది.



వి'చిత్రం'

హేయ్ చిన్నారులూ... ఇవాళ వి'చిత్రం'లో మీ ముందుకు మూడు గాడిదలు వచ్చాయి. ఇవి సామాన్యమైన గాడిదలు కావర్రా! ఇవి ఎప్పుడూ కలిసే తిరుగుతాయి. పైగా వీటికి బడాయిలు ఎక్కువ. ప్రశ్నలూ ఎక్కువే. ఎంత ఎక్కువంటే... 'హ్హా..హ్హా..హ్హా... మేం ముగ్గురం వున్నాం కదా. కానీ మా చెవులు ఎన్ని వున్నాయో చెప్పకోండి?' అని ఏవేవో ప్రశ్నలు వేస్తుంటాయి. ఇంతకీ వాటికి ఎన్ని చెవులున్నాయో చెప్పకోండి. మూడా! మరి వాటి ప్రత్యేకత ఏంటో చెప్పకోండి? తెలీలేదా అయితే జవాబు చదవండి.



జవాబు

వీటికి మూడు చెవులు వున్నాయన్నారు కదా. కానీ...వాటి స్పెషాలిటీ ఏంటంటే... ప్రతి గాడిదకూ రెండు చెవులున్నట్టే కనిపించడం. అవునా! మరి అందుకే వాటికి బడాయి, గొప్పలు ఎక్కువ. మరి పై వారం మరో వి'చిత్రం'తో మీ ముందుంటామే.

ఎందుకలా?

అదో కోర్టు. జడ్జీగారి ఎదురుగా ముగ్గురు నిందితులు నిలబడి వున్నారు. జడ్జీగారు మొదటి వ్యక్తివైపు తిరిగి 'కేసుకు సంబంధించి నువ్వు ఏమైనా చెప్పాలనుకుంటున్నావా?' అనడిగారు. అప్పుడు రెండో వ్యక్తి 'లేదండీ. ఏం లేదు' అన్నాడు. దానికి జడ్జీగారు 'నేను నీతో మాట్లాడడంలేదు' అన్నారు. దానికి మూడో వ్యక్తి 'అసలు నేను నోరు మెదపలేదు కదండీ' అన్నాడు. ఇంతకీ ఇలా ఎందుకు జరిగింది? ఒకరికి బదులు మరొకరు సమాధానం ఎందుకు చెప్పారు? మీకేమన్నా తెలుసా! తెలీకపోతే జవాబు చూడండి తెలిసిపోతుంది.

జవాబు: ఎందుకంటే... ఎందుకంటే.... జడ్జీగారికి మెల్ల వుంది.

ఆ పెన్సిల్ ఏది?

చిన్నారులూ... ఇక్కడ కొన్ని పెనిల్సు కుప్పగా పోసి వున్నాయి కదా. వాటిలో కింద నుంచి పైకి మూడో పెన్సిల్ ఏదో మీరు చెప్పాలి. ఏంటి అలా క్వశ్చన్ మార్క్ మొహం పెట్టి చూస్తున్నారు? మీరే చెప్పాలి. ఎంత ఆలోచించినా తెలీడంలేదా! అయితే మా జవాబేంటో చూడండి.



జవాబు: 7వ నెంబరు పెన్సిల్.

కాగితపు పంకా కావాలా!

నేస్తాలూ... వచ్చేశారా! మేం మీకోసమే ఎదురు చూస్తున్నామర్రా. ఎందుకంటే ఇవాళ మీకోసం ఓ చక్కటి ఆట వస్తువు తయారు చెయ్యడం ఎలాగో చెప్పబోతున్నాం.అదేంటంటే... కాగితపు పంకా (పేపర్ ఫ్యాన్). మరి జాగ్రత్తగా చేసి ఆడుకుంటారా!



ఏమేం కావాలంటే...

కత్తెర, రంగుల కాగితాలు, పిన్ను, సన్నటి కర్రపుల్ల (స్ట్రా).



ఎలా చెయ్యాలంటే...

ముందు కాగితాన్ని తీసుకోండి. దాన్ని దీర్ఘచతురస్రాకారంలో కత్తిరించండి. తర్వాత మొదటి బొమ్మలో చూపించినట్టుగా పేపర్ నాలుగు చివర్ల గుర్తులు పెట్టుకోండి. ఆ లైను వరకు కత్తిరించండి. ఇప్పుడు నాలుగు చివర్లను లోపలికి వంచాలి. అచ్చం బొమ్మలో చూపించినట్టన్నమాట. ఆ కాగితాల మధ్యలో పిన్ను గుచ్చాలి. ఇప్పుడు పిన్నును కర్రపుల్లకి ఒక చివరన గుచ్చాలి. అంతే.... కాగితపు పంకా సిద్ధమైనట్టే. ఎంచక్కా కర్రపుల్ల పట్టుకుని పరిగెడుతుంటే పంకా గిర్రున తిరుగుతుంది. భలే తమాషాగా వుంటుంది. మరి క్రిస్టమస్ సెలవుల్లో చేస్తారుగా. వచ్చేవారం మరో కాగితపు బొమ్మను తయారు చెయ్యడం గురించి చెప్తాం. అందాకా ఎదురు చూస్తుంటారుగా.







చిన్నారులూ!

ఈ వారం 'వీరి వీరి గుమ్మడి పండు వీరిపేరేమి'లో ఓ తాతయ్య వచ్చారు. ఈయనను తరచూ టీవీలో చూస్తూనే వుంటాం. గుర్తొచ్చేశారా! ఇప్పుడు మీరు యమ అర్జంటుగా ఏం చెయ్యాలంటే... కార్డు తీసుకుని ఆయన పేరు రాసి పోస్టు చేయండి. సరైన సమాధానం రాస్తే మీ పేరు, తరగతి, ఊరు ప్రచురిస్తాం. అన్నట్టు మీ నేస్తాలను కూడా ఈ శీర్షికలో పాల్గొనమని చెప్పండే. మరి మా చిరునామా: **వీరి పేరేమి?** బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్‌నెం.1, అశోక్‌నగర్, హైదరాబాదు.

వీరి వీరి గుమ్మడిపండు...
వీరి పేరేమి?



సరైన సమాధానం రాసినవారు

(బ్రాకెట్‌లో వున్న అంకె వారు చదువుతున్న తరగతి)

జి.సాయిభరత్‌రెడ్డి (6), మోదుకూరు. బి.భరత్ (4), కందుకూరు. వి.శ్రీనీత (7), దేవరకోట. సిహెచ్ రాజ్యలక్ష్మి (8), ఘంటసాల. పి.అఖిల (8), పత్తికొండ. బి.రమేష్ (8), చందుపట్ల (బి). కె.రాజేష్ (8), పెద్దబీరపల్లి. ఎస్.నాగరాజు (9), శ్రీకాకుళం. కె.శ్రీతన్మయ (2), గుంటూరు. సిహెచ్ చిత్రాంజలి (5), కాకినాడ. ఎ.హేమంత్ (9), దామరమడుగు. పి.కార్తికేయచారి (6), పెద్ద శంకరంపేట. పి.సందీప్ (8), కొమ్మాది. కె.సుధీర్, సింధు (6), ఖమ్మం. వి.శ్వేత (6), నెల్లూరు. ఎం.డి.మాలిక్ (8), హమీద్ (6), ముసాపేట. కె.అనురాధ (9), పోతలపాడు.ఎం.విజయ లెనిన్ చక్రవర్తి (9), గబ్బాడ. ఎస్.దివ్య (7), రాజాం.

గతవారపు జవాబు: ఎమ్.ఎస్.సుబ్బులక్ష్మి

చిన్నారి చిత్రకారులు

ప్రజాశక్తి నిర్వహించిన 'చిత్రలేఖనం' పోటీలో ప్రథమ, ద్వితీయ బహుమతులు పొందిన చిత్రాలు



కటారి తిరుపతిస్వామి, (ప్రథమ బహుమతి రూ.100) 8వ తరగతి, టిజె హైస్కూల్, బిసిహాస్టల్, నాజర్‌పేట, కొత్తపేట, తెనాలి.



కొమ్మలపాటి సాహిల్ (ద్వితీయ బహుమతి రూ.50), 2వ తరగతి, పి అండ్ టి జ్ఞానదీప్ స్కూల్, అశోక్‌నగర్, హైదరాబాదు.

దారి కనుక్కోండి చూద్దాం!



ఉదయం పది గంటలైంది.

ఎండాకాలం... గాలి వీస్తున్నా గాలిలో తేమ లేనందువల్ల ఉక్కగా ఉంది. ఆకాశంలో సూర్యుడు నిప్పులు చెరుగుతున్నాడు.

గుంటూరు-మంగళగిరి రోడ్డు...

వాహనాల రాకపోకలు తక్కువగా ఉన్నాయి. రోడ్డు పక్క చెట్ల నీడల్లో లారీలను ఆపి కొంతమంది సిబ్బంది విశ్రాంతి తీసుకుంటున్నారు.

అక్కడికి దగ్గరగా 'పరమాయికుంట' గ్రామ సమీపంలో 'శ్రీనివాస శిల్ప కళామందిర్' బోర్డు వచ్చే పోయే వారిని ఆకర్షిస్తూ కనిపిస్తోంది. లోపల చిన్న గది.. దానిని ఆనుకుని విశాలమైన స్థలం... ఆ పక్కన పెద్ద షెడ్డు ఉన్నాయి. లోపల కొంతమంది సిబ్బంది పనిచేస్తున్నారు...



శిల్పి

పాతూరి రాజేంద్ర ప్రసాద్ వర్మ

దుమ్ము రేపుకుంటూ ఓ జీపు వచ్చి ఆగింది.

అందులో నుంచి నలుగురు వ్యక్తులు దిగారు. వారి వెనుక డ్రైవరు, అటెండరులా ఉన్న ఒక కుర్రవాడు దిగారు. అందరూ కలసి లోపలికి ప్రవేశించారు.

కళామందిర్‌లో వ్యక్తి వారిని గదిలో ఉన్న బల్లలపైన కూర్చోమన్నాడు.

"రేపల్లె నుంచి వచ్చాం.. గాంధీ విగ్రహం ఒకటి తయారుచేయాలి!" పంచె కట్టుకున్న వ్యక్తి చెప్పాడు.

"అమ్మగారు... షెడ్డులో ఉన్నారు. పిలుచుకుని వస్తాను!" అని ఆ వ్యక్తి పక్కన ఉన్న షెడ్డులోకి వెళ్లాడు.

ఈ లోపు జీపులో వచ్చిన వ్యక్తులు పరిసర ప్రాంతాలను పరిశీలించడం మొదలుపెట్టారు. ఆ సమీపంలో తయారైన రకరకాల విగ్రహాలు ఉన్నాయి. దేశనాయకులు, దేవతా మూర్తులు, వివిధ దేవుళ్ల విగ్రహాలు వారిని ఎంతగానో ఆకట్టుకున్నాయి. వాటిలో జీవకళ ఉట్టి పడుతోంది.

"ఎవరూ?" ఒకామె లోపలికి వచ్చి పలకరించింది.

చేతికి అంటిన మట్టిని దులుపుకుని ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చుంది.

అందరూ లేచి నమస్కరించారు.

"రేపల్లెలో గాంధీ విగ్రహాన్ని ప్రతిష్టిస్తున్నాం. మీ గురించి విన్నాము. మీ ద్వారా ఆ విగ్రహాన్ని తయారు చేయించాలని వచ్చాము!" వారిలో పంచె కట్టుకుని రాజకీయ నాయకునిలా ఉన్న వ్యక్తి చెప్పాడు.

"ఎండలో చాలా దూరం నుంచి వచ్చారు. చాలా సంతోషం!" అంటూ ఆమె వర్క్‌షాపులో కుర్రవాడిని పంపించి కూల్ డ్రింక్‌లు తెప్పించింది.

ఆమె ఆతిథ్యానికి వారు ఆశ్చర్యపోయారు.

"మీరు తయారు చేసే విగ్రహాలు సజీవంగా ఉన్నట్లు అనిపిస్తాయి. మీ పనితనం గూర్చి చాలామంది వివిధ గ్రామాల్లో చెప్పారు. మా గ్రామంలో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించాలనుకున్న విగ్రహాన్ని మీరే తయారు చేయాలి-" వచ్చిన వ్యక్తులు అభ్యర్థించారు.

"నా పైన, నా పనితనంపైన మీరు చూపించే అభిమానానికి కృతజ్ఞతలు.. మీ నమ్మకాన్ని వమ్ము చేయకుండా మీకు కావల్సిన విధంగా గాంధీ విగ్రహాన్ని తయారుచేసిపెడతాను" అంది ఆమె.

విగ్రహం ఏ విధంగా ఉండాలి, ఎంతసైజులో ఉండాలన్న వివరాలను వారి వద్ద నుంచి తీసుకుంది. రంగుల కాంబినేషన్ గురించి కూడా అడిగి తెలుసుకుంది. "వారం రోజుల్లో గాంధీ విగ్రహాన్ని తీసుకుని వెళ్లవచ్చు..!" అంది.

వచ్చిన వారందరూ సంతోషంగా లేచి నిల్చున్నారు.

సెలవు తీసుకుని బైటికి వచ్చి జీపు ఎక్కారు.

దూళిని రేపుకుంటూ జీపు సాగిపోయింది.

* * *

శిల్పకళ పురుషులకే అంకితమైనదిగా కొంత కాలంగా ఉంది. చాలామంది నైపుణ్యం కలిగిన స్త్రీలు ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో దీనిని వృత్తిగా స్వీకరించిన మహిళలు అరుదుగా కనిపిస్తుంటారు.

గుంటూరుకు చెందిన ఆరాధ్యుల విజయలక్ష్మి దీనికి మినహాయింపుగా నిలుస్తారు. శిల్పిగా ఎంతో పేరు సంపాదించుకున్నారు.

పదవ తరగతి వరకూ గుంటూరులో చదివారు.

తర్వాత చదువు కొనసాగలేదు. పదిహేడేళ్ల వయసులో సత్తెనపల్లి యువకునితో వివాహం జరగడంతో విజయలక్ష్మి మకాం సత్తెనపల్లికి మారిపోయింది. ఈమె తండ్రి నాలి గురుమూర్తి గుంటూరులో వివిధ రకాల బొమ్మలు తయారుచేస్తూ జీవనాన్ని గడుపుతున్నారు. ఆయన ద్వారా విజయలక్ష్మి రకరకాల విషయాలను తెలుసుకుంది.

వివాహం తర్వాత ఇద్దరు అబ్బాయిలు, అమ్మాయిలు పుట్టే వరకూ ఈమెలో కళాకారిణి అంతర్గతంగానే ఉండిపోయింది. పిల్లలు పెద్దవాళ్లవడం, భర్త ఒక్కడి జీతం కుటుంబ పోషణకు సరిపోకపోవడంతో విజయలక్ష్మి విగ్రహాలు తయారుచేయడం ద్వారా ఉపాధి పొందాలని నిర్ణయించుకుంది. పిల్లలకు ఉన్నత చదువులు చదివించాలన్నా, మంచి భవిష్యత్ ఇవ్వాలన్నా భార్యాభర్తలిద్దరూ ఆదాయాన్ని సంపాదిస్తే బాగుంటుందని భావించింది.

చిన్నతనం నుంచి రకరకాల బొమ్మలు గీయడంలో అనుభవం ఉండటం వల్ల శిల్పాలు రూపొందించడం సులభం అయిపోయింది. దీంతో ఎలాగైనా శిల్పాలు అందంగా చెక్కాలన్న పట్టుదల పెరిగింది. అంతవరకూ ఉన్న పద్ధతులకు భిన్నంగా వాస్తవికత ఉట్టిపడేలా శిల్పాలు తయారుచేస్తే బాగుంటుందని భావించింది. తనలో చిత్రాలు గీయడంలో ఉన్న ఆసక్తి ఇలా ఎంతగానో ఉపయోగపడింది. విజయలక్ష్మి ఆలోచనలకు తండ్రి నుంచి, భర్త నుంచి ఎంతగానో ప్రోత్సాహం లభించింది.

దీంతో విజయలక్ష్మి తన కళను కొనసాగించింది.

"నువ్వు శిల్పాలు తయారుచేయడంలో శిక్షణ పొందినట్లయితే మరింత చక్కగా రూపొందించగలవన్న!" భర్త ప్రోత్సాహం ఆమెకు కొండంత ధైర్యాన్నిచ్చింది.

తర్వాత మద్రాసు వెళ్లి నెల రోజులపాటు శిక్షణ పొందింది.

అంతవరకూ తనకు తెలిసిన విద్యకు, శిక్షణ మరింత మెరుగుపడేలా చేసింది. ఈ శిక్షణ శిల్పాలు తయారు చేయడంలో విజయలక్ష్మికి ఎంతో ఉపయోగపడింది.

మొదటిసారిగా సీతారాములు లక్ష్మణునితో కలిసి కూర్చున్నట్లు ఒక సెట్‌ను సిమెంటుతో తయారు చేసింది. తయారీలో నైపుణ్యం ఉండటంతో అందంగా తయారైంది. మూడు అడుగుల ఎత్తులో తయారైన విగ్రహాల సెట్‌కు, రకరకాల రంగులు అద్దడంతో ఆకర్షణీయంగా కనిపించింది. విజయలక్ష్మికి ఈ విగ్రహాన్ని ఎక్కడ అమ్మాలో అర్థం కాలేదు. వెంటనే గుంటూరులో తండ్రి గురుమూర్తిని సంప్రదించడంతో ఆయన విగ్రహాన్ని తెప్పించుకుని అమ్మిపెట్టారు.

మొట్టమొదటిసారి తయారుచేసిన విగ్రహం అమ్ముడైపోవడంతో విజయలక్ష్మిలో ఉత్సాహం ఉరకలు వేసింది. తర్వాత రకరకాల విగ్రహాలు తయారుచేయడంలో దృష్టి కేంద్రీకరించింది.

ఎక్కడలేని ఉత్సాహం కలగడంతో ఎప్పటికప్పుడు తన నైపుణ్యాన్ని మెరుగుపరుచుకుంది రకరకాల విగ్రహాలను తయారు చేయడంలో విజయలక్ష్మి ముందంజ వేసింది. చారిత్రక పురుషుల విగ్రహాలు, దేవతా విగ్రహాలు, దేశ నాయకుల విగ్రహాలను తయారు చేయడంలో అందెవేసిన చెయ్యిగా ఆమె పేరు సంపాదించుకుంది.

ఎవరి శిల్పం తయారుచేయాలన్నా ముందుగా వారి ఫొటోను కాని చిత్రాన్ని కాని చూసి పోలికలను గుర్తిస్తుంది. తర్వాత విగ్రహం తయారీలో నిమగ్నమై వీలైనంత జీవకళ ఉట్టిపడేలా కృషి చేస్తుంది. ఫొటోను చూసి చేస్తే ముమ్మూర్తులా అసలు ఫొటో మాదిరిగానే శిల్పం తయారవుతుంది.

విజయలక్ష్మి వృత్తికి మొదట్లో ప్రోత్సాహం లభించలేదు. ఎంత కష్టపడినా గుర్తింపు ఉండేది కాదు. చూసినవారంతా బొమ్మలు ఎంతో చక్కగా ఉన్నాయని చెప్పడం తప్ప ఆర్థికంగా ప్రయోజనం లభించేది కాదు. తన అవసరం అందరికీ ఉందన్న విషయం చెప్పాలని ప్రయత్నించింది.

ఇళ్లు నిర్మించుకొనే వారి వద్దకు వెళ్లి పైన దేవతామూర్తులు, ఆవులు, సింహాలు వంటి బొమ్మలు ఏర్పాటు చేస్తే ఇంటికి ఎంతో కళ వస్తుందని చెప్పేది. కొంతమంది ఇష్టపడేవారు. మరికొంతమంది వద్దనేవారు. అయినప్పటికీ ఆరాధ్యుల విజయలక్ష్మి నిరుత్సాహం చెందలేదు. కొన్ని దేవాలయాల వద్దకు, వాటి ధర్మకర్తల వద్దకు వెళ్లి అక్కడ దశావతారాలు, దేవుళ్ల చరిత్రలను తెలిపే బొమ్మలను ఏర్పాటు చేస్తే నిండుగా ఉంటుందని వివరించేవారు. అయినా కొంతమంది వినేవారు కాదు. "ఎందుకులేమ్మా!" అని నిరాశపరిచేవారు. అయినా విజయలక్ష్మి తన పట్టుదల విడవకుండా కృషి చేసింది. వద్దన్న వారిని ఒప్పించి వివిధ దేవాలయాల వద్ద రకరకాల దేవుళ్ల విగ్రహాలను తయారు చేసేవారు. వద్దన్నవారే కావాలనే విధంగా ఆర్డర్లు సంపాదించేవారు.





* * *

విగ్రహాలు తయారు చేయడానికి ముడిసరుకు కోసం కొంత వ్యయం అవుతుంది. తయారు చేయించాలనుకునేవారు ముందుగా స్వల్ప మొత్తంలోనే అడ్వాన్సుగా ఇస్తుంటారు. ఆ సొమ్ముతో సిమెంటు, మన్ను ఇతర ముడిసరుకులు, రంగులు కొనుగోలు చేయడం... సిబ్బందికి జీతభత్యాలు చెల్లించడం వంటి వాటికి అదనపు వ్యయం అవుతోంది.

పెట్టుబడి లేకపోవడం ఇబ్బందులను కలిగించింది.

ఆ సమయంలో విజయలక్ష్మి సత్తెనపల్లిలో స్టేటు బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖను సంప్రదించింది. రుణం కావాలని వారిని అభ్యర్థించింది- "శిల్పాలు తయారు చేయడానికి రుణం ఏమిట"ని వారు ఆశ్చర్యపోయారు.

విజయలక్ష్మి ఇంటి వద్ద తను ఇంతవరకూ చేపట్టిన వివిధ రకాల పనులు, తయారు చేసిన విగ్రహాల ఫొటోలను బ్యాంకు మేనేజర్‌కు చూపించారు- "ప్రస్తుతం విగ్రహాలను స్వంత పెట్టుబడి పెట్టి తయారు చేయడం కష్టంగా ఉంది. రుణం మంజూరు చేస్తే మరింతగా అభివృద్ధి చేస్తాను!" అన్నారు.

ఆమె చెప్పిన విషయం... అందించిన ప్రతిపాదనలు విని బ్యాంకు మేనేజర్ సంతృప్తి వ్యక్తం చేశాడు. "ఎక్కడో మారుమూల ప్రాంతంలో ఈ వ్యాపారం చేయడం వల్ల ప్రయోజనం ఉండదు. గుంటూరు సమీపంలో అయితే మరిన్ని ఆర్డర్లు లభిస్తాయి... అందుకు తగిన స్థలాన్ని చూస్తే రుణాన్ని మంజూరు చేస్తాను" అన్నారు.

ఆ తర్వాత విజయలక్ష్మి గుంటూరులో మంగళగిరి రోడ్డులో ఉన్న పరమాయికుంట వద్ద స్థలాన్ని చూసి విగ్రహాల తయారీకి అనుకూలంగా ఉంటుందని బ్యాంకు అధికారులకు తెలియజేశారు. వారు ఫీల్డు ఆఫీసర్‌తో స్థలాన్ని పరిశీలించి రుణాన్ని మంజూరు చేశారు.

బ్యాంకు అందించిన రుణంతో ఆ స్థలంలో షెడ్డు, చిన్నగది నిర్మించారు. విగ్రహాలను ఉంచడానికి ఖాళీ స్థలాన్ని ఉండేలా విశాలంగా 'శ్రీనివాస శిల్ప కళామందిర్' పేరుతో వర్కుషాపును ప్రారంభించారు. కొంతమంది సిబ్బందిని కూడా తనకు సహాయంగా నియమించుకున్నారు.

'శ్రీనివాస శిల్ప కళామందిర్' విజయలక్ష్మిలో కళాతృష్ణను, ఆసక్తిని ప్రోత్సహించడానికి ఎంతో ఉపయోగపడింది.

* *

శిల్పకళామందిర్' షెడ్డులో విజయ సరస్వతిదేవి విగ్రహాన్ని తయారు చేయడంలో నిమగ్నమై ఉన్నారు. సిబ్బంది రంగులు అందిస్తూ సహాయం చేస్తున్నారు.

తెల్లని హంస వాహనంపై వీణ మీటుతూ కూర్చున్న భంగిమలో సరస్వతీదేవి విగ్రహం చూపరులను ఆకట్టుకుంటోంది.

కొంతకాలంగా ఆమె చేస్తున్న కృషిని ఎంతోమంది మెచ్చుకున్నారు. స్వచ్ఛంద సంస్థలు, కళా సాంస్కృతిక సంస్థలు ఆమెను సత్కరించి అభినందనలు అందజేశాయి. ఆమె చేస్తున్న పనిని ప్రతి ఒక్కరూ మెచ్చుకోవడంతో మరింత ఉత్సాహం కలుగుతోంది.

కళాసంస్థ ఇచ్చిన ఆర్డరు మేరకు సరస్వతీదేవి విగ్రహాన్ని రూపొందిస్తున్నారు.

ఆ సమయంలో మహిళా సంఘం సభ్యులు గుంపుగా అక్కడికి వచ్చారు. వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టడంలో మహిళా సంఘానికి ప్రత్యేక గుర్తింపు ఉంది.

వారిని చూసి విజయలక్ష్మి పనిని ఆపి వచ్చింది.

"ఒక స్త్రీగా మీ కృషిని తెలుసుకుని వచ్చాం. మీ వంటి వారు ఎంతోమంది మహిళలకు ఆదర్శప్రాయులు... మిమ్మల్ని అభినందించడానికి వచ్చాం!" వారిలో సంస్థ అధ్యక్షురాలు పుష్పగుచ్ఛాన్ని విజయలక్ష్మికి అందించారు. మిగిలిన వారు కూడా అభినందించారు.

విజయలక్ష్మికి ఎంతో ఉత్సాహంగా అనిపించింది. ఇంతవరకూ కొన్ని సంస్థలు ఆమెను సత్కరించినా మహిళలంతా మూకుమ్మడిగా వచ్చి తన కృషిని మెచ్చుకోవడం మనసులో ఆనందాన్ని కలిగించింది. "థ్యాంక్స్!" అంది.

తర్వాత అందరికీ టీ, బిస్కట్లు అందించింది.

"పురుషులు కూడా ముందుకు రాని రంగంలో ప్రావీణ్యం సంపాదించారు. మహిళా శిల్పిగా కీర్తిని సంపాదించారు. మీ కృషి ఎందరికో ఆదర్శం...!" అని మహిళా సంఘం కార్యదర్శి అన్నారు.

"నేను చేసింది ఏమీ లేదు. అవసరం నన్ను ఈ రంగం వైపు ముందుకు వెళ్ళేలా చేసింది. ఈ పనిలో నాకున్న ఆసక్తి వల్ల దీనినే ఎంచుకున్నాను..."

"మీరు మంచి శిల్పి!"

విజయలక్ష్మి ఆ మాటలకు ఏం జవాబివ్వలేదు.

అలా అన్న అమ్మాయి వైపు తిరిగి -"నేనే కాదు ప్రతి స్త్రీ కూడా మంచి శిల్పే... ఒకొక్కరు ఒక్కో రంగంలో కృషి చేస్తారు. ఇంటిని తీర్చి దిద్దుతారు... ఆదర్శవంతంగా పిల్లల్ని పెంచుతారు... మంచి కుటుంబంగా మలుస్తారు... ఇవన్నీ శిల్పి లక్షణాలే. ఎటొచ్చీ నేను మట్టితో, సిమెంటుతో, సున్నంతో బొమ్మలు తయారు చేస్తాను..." అంతే

ఆమె సమాధానం మహిళలకు ఆనందాన్నిచ్చింది.

"మహిళలకు మీరిచ్చే సందేశం ఏమిటి?"

"నేను సందేశాలు ఇచ్చేంత పెద్దదానిని కాదు. తోటి మహిళలకు నేను చెప్పేది ఒక్కటే. ఆసక్తి ఉండి పట్టుదలతో శ్రమిస్తే ఏ రంగంలో అయినా రాణించవచ్చు..."

ఆమె కళ్లల్లో కొత్త వెలుగు ప్రవేశించింది.

❖

త్రినేత్ర

నేను అనలేకపోతున్నానే...!



అవును... నేననలేకపోతున్నాను. ఎందుకని... అనడిగితే, నా దగ్గరే సమాధానమూ లేదు మరి!

అసలిన్నాళ్ళూ అలా అడగాల్సిన అగత్యం మన ఆడాళ్ళకు ఉందని అనుకోలేదు నేను.

ఏం చెయ్యమంటారు...నన్నట్లా పెంచారు. లేదా నేనే అలా పెరిగాను.

పేరుకి చదువుకున్నదాన్నే. కానీ ఏం లాభం?!

మా వెనుకవీధి చివర్నుండే నాంచారమ్మలాగా నేననలేకపోతున్నాను.

ఓరి నీ జిమ్మడిపోనూ...నీ సేతులడిపోనూ...ఎదవన్నరెదవా...అంటూ ఎన్నో విశేషణాలు చేర్చి మరీ అడిగేస్తోంది.

ఎవర్నో అయితే నేనింతగా ఆశ్చర్యపోయేదాన్ని కాదు.

సాక్షాత్తు దాని మెళ్ళో తాళి కట్టిన వెంకటేశునే అంటోంది.

అయ్యో... జీవితాంతం తోడుండాల్సిన భర్తను అలాంటి కటిక తిట్లూ, శాపనార్థాలూ తిట్టకూడదే అని కాసేపు అనిపించింది. కానీ...

అలా ఉండాల్సినవాడు ఏం చేశాడో మరి నాంచారమ్మ అలా తిట్ల పురాణంతో అడుగుతోంది...కాదు కాదు కడుగుతోంది.

కడగటం కాదు గదా అడగటం కూడా నాకు చేతకాలేదేంటాని...?!

ఆ మాటకొస్తే నాకే కాదు...ఆ ఎదురింటి సుమతక్కయ్యగారూ అంతే...

ఆ పక్కనుండే అనసూయమ్మ పిన్నిగారు కూడా...

తమ తమ భర్త మహానుభావులను నాకుమల్లే ఏమనలేకపోవటం, ఏమడగలేకపోవడం నేనూ గమనించాను.

ఎదురింటి ధర్మారావుగారు చీట్లపేకాడ్డం దగ్గర్నుంచి సింగిల్ నెంబరు లాటరీలు, ఇంటర్నెట్టు యూరో నెంబర్ లాటరీల వరకూ సర్వ జూదకళాప్రియుడు. అయినా సరే తగలడిపోతున్న నెలవారీ జీతం డబ్బుల గురించేవీ అడగలేకపోవటం నాలాగే అందరం గమనించేశాం. కానీ ఆ పిచ్చి మా తల్లి సుమతక్కయ్యగారు ఇదందరికీ తెలియకూడదనుకునే "గుట్టు" అనుకుంటూంటుంది.

ఆ పక్కింటి రామచంద్రరావు బాబాయిగారు...

ఆయన్ను "బాబాయిగారు" అని ముందు జాగ్రత్తగా మేమే అనేస్తాం గానీ... నిజానికాయన ఆ పిలుపుకి తగడేమో!

బావగారని పిలుపించుకోవాలనుకునే ఈ రామచంద్రయ్యగారి బుర్రలో బుద్ధిని "బాబాయిగారు" అనేసి మా వైపుకి రాకుండా చూసుకోవాల్సివస్తుంది.

పాపమాయనగారి ఆ పాపపుబుద్ధి గురించి అందరికీ తెలియదనో... తెలియకూడదనో అనసూయమ్మ పిన్నిగారు ముక్కోటి దేవుళ్లకూ మొక్కుకుంటారు. అంతేగానీ నోరుతెరిచి తన 'రాములవారి'ని అనలేదు...అడగలేదు మరి.

కానీ ఆ వెనక వీధి చివర్నుండే నాంచారమ్మ అలాకాదు.

తాగొచ్చాడని తాళిగట్టిన మొగుణ్ణి నిలబెట్టి కడిగేయడం మా కళ్ళారా చూస్తూనే ఉన్నాం. సంపాయిచ్చుకొచ్చి ఇల్లు గడపకపోగా నాంచారమ్మ పాచిపనో, అంట్లపనో చేసి ఇంట్లో దాచిన డబ్బులు ఎత్తుకుపోయి మరీ తాగాడని చొక్కా పట్టుకుంది.

వాడు పనిచేసే మేస్త్రీ దగ్గర్నుంచి రావాల్సిన డబ్బులిక నుంచి తానే తీసుకుంటానని ఆర్డరేసేసింది.

ఇంతా చేసి మళ్ళీ తానే వాడికి అన్నం కలిపి తినిపిస్తూ... ఇంకోమాలి ఇట్టాగల్లరి పెట్టినవో ఇగ చూస్కో అనంటూనే ఉంటుంది.

నా పతిదేవుడూ పేరుకే వీరమాచినేని సద్గుణరావు...సురాపానంలో అష్టావధానియే... మరేం లేదులేండి. ఆఫీసులోని మావారి సెక్షన్ తాగుడుమిత్రబృందం ఎనిమిదిమందిలేండి. అందుకే వారు సురాపానష్టావధాని!

కానీ ఏ ఒక్కనాడూ ఏవిటండీ ఇలా...అని నోరు తెరిచి అనలేకపోతున్నాను. ఒకవేళ గొణిగినంత సౌండ్‌లోనే...ఇంట్లో ఉన్న పిల్లలక్కూడా వినబడనంత డెసిబెల్స్ స్థాయిలోనే అడిగినా...

ఏవిటే నోరులేస్తోందని ఆ వీధంతా వినబడిపోతుందేమోనన్నంతగా నోరుచేసుకుంటారు.

అసలే గుట్టుగా సంసారం చేసుకుంటున్నాం కదా! ఆ గుట్టుకోసం ఎంత నోరునొక్కుకుంటున్నానో...

ఇంతకీ ఆ గుట్టు సుమతక్కయ్య "గుట్టు"లా...అనసూయమ్మపిన్నిగారి "గుట్టులా" అయిపోయిందేమో...

ఏవిటో...ఎవరికీ తెలియదనుకునే ఎవరికి వారం అనుకుంటామా... అది ఈ పాటికే ఆ వీధి నోటిపారాయణమైపోయుంటుంది. అయినా...గుట్టు గుట్టు అనుకుంటూ నోరునొక్కుకుంటున్నామో...గొంతు నొక్కుకుంటున్నామో...ఆలోచనలే తొక్కేసుకుంటున్నామో గానీ నాంచారమ్మ నోరు మా చదువుకున్నతనాన్ని ప్రశ్నిస్తున్నట్లే ఉంది.

నాంచారమ్మా...మా ఇంట వంటగిన్నెల్నే కాదు...మా బుర్రల్ని కూడా కాస్త కడగవే... మేమూ...అనవసర మగపెత్తనాల్ని కడుగుతాం. ✥

"శిరోధార్యం"

రుక్మిణి

గోపాలం, భూపాలం బాల్య మిత్రులు – ఒకే కంచంలో తినకున్నా ఒకే స్కూలు–కాలేజీ– చదివి, ఒకే ఆఫీసులో ఉద్యోగం సంపాదించారు. పక్క పక్క పోర్షన్లలో భార్యలతో కాపురం పెట్టారు. పిల్లా పీచూ – చీకుచింతా లేని జీవితం – అది మూడుసిన్మాలూ... ఆరు పాటలుగా వెలిగిపోతోంది. ఇద్దరిదీ ఒకే మాట –రూటు.



ముందు గోపాలాన్ని ఆ దినం హాస్పిటల్‌లో చేర్చారు. అది అయిదు నక్షత్రాల కార్పొరేట్ హాస్పిటల్–ఎ.సి. రోబోటుల వలే వైద్యులు గోపాలం మీదికి రేచు కుక్కల్లా ఎగబడ్డారు. ఎక్స్‌రేలు తీశారు. స్కానింగ్ టెస్టులు సరేసరి! గోపాలం తల వాచిపోయింది మరి! రోజూ ఒక అరమిల్లీమీటరు వంతున వాచి పోతుందనీ... జుత్తు లక్ష మైక్రాన్ల మందాన పొడవు తగ్గుతుందనీ మాత్రం కనిపెట్టారు.

"హూర్‌ఫెలో... అయ్‌మీన్.. నలభైరోజుల్లో వీడికి తలమీద బొచ్చే లేకుండా బఫెలో స్కిన్‌లా నిగనిగలాడే గుండుతోనే బతకాల్సి వస్తుంది". ఓ ముసలి యఫ్.ఆర్.సి.యస్ (లండన్) నిట్టూర్చాడు. గోపాలం గిజగిజలాడిపోయాడు. అట్ల .గిజగిజలాడడం తెచ్చిపెట్టింది పెద్ద తంటా! మెడ నరాలు జివ్వుమని, వేయికొండ చిలువలు వాటేసుకుని నలిపేస్తున్నట్లు విలవిల్లాడిపోయాడు. కాళ్ళు తపతపా కొట్టుకున్నాడు.

"ఈజిట్ మెనంజైటిస్.. అయ్ థింక్ సో...!

"నో...నో..దటీజ్ చైల్డ్‌హుడ్ డిసీజ్... నో పాజిబులిటీస్!"

"ఇట్ మేబి స్పాండలైటీస్"!

ఈ విషయమ్మై డాక్టర్లు ఘర్షణకు దిగిపోయారు. ఆ వాదనలలో కొందరు డాక్టర్ల తలలు దిమ్మెరపోయాయి. అచేతనులయిపోయారు. ఇదే అదను చూసుకుని బురకాయలు దిమ్మెరపోని డాక్టర్లు చెంగున లంఘించి వాళ్ళ కాలర్లు ఒడిసిపట్టుకుని వాళ్ళ మొహాల్లో మొహంపెట్టి తమ వాదనలను రెట్టించిన హోరులో గాండ్రించారు. తట్టుకోలేక యఫ్.ఆర్.సి.యస్ (లండన్) గారు మూర్ఛపోయారు. డాక్టర్లు వారిని స్ట్రెచర్ మీదికెక్కించి 'మెంటల్‌క్యూర్' వార్డుకు తరలించారు.

రెండో విడత వరాల జల్లుగా... మరో రకమైన టెస్టులకు తగులుకున్నారు. మల, మూత్ర, రక్త, జీవకణ, నాడీ జాల తంతుల పరీక్షకు ఒంటి నిండా గాట్లు పెట్టారు. తిరిగి మళ్ళీ చర్చలు.

"నాకు చెవులు హోరెత్తి పోతున్నాయి. వందకార్లు, స్కూటర్ల వెయ్యి కిలోమీటర్ల రేసులు నా బుర్రలోనే జరుగుతున్నాయి. –నేనింక బతకలేను... నా మెడ..నా మెడ... హమ్మో"!

"నీ మెడ నీ దగ్గరే వుంది భాయి భయపడకు! నీ మెడనరం ఒకటి కోసి కాలిఫోర్నియాకు, ప్రపంచ ఆరోగ్య సంస్థకూ పంపుతున్నాం– ఇటీజ్ రేర్ కేస్"! అంటూ డాక్టర్, సానుభూతిగా గోపాలం భుజం తట్టాడు. గోపాలం కెవ్వుమన్నాడు.

నిరంతర ప్రాణవాయు సరఫరా జరుగుతోంది– సీసాల కొద్దీ రక్తం తెచ్చారు. 'అయితే ఏ అవయవాన్ని కోయాలో.. ఎక్కడ్నుంచి ఆపరేషన్ మొదలుపెట్టాలో, అసలు ఆపరేషనెందుకు చేయాలో' అర్థంగాక సర్జన్లు తికమక పడిపోతున్నారు.

హాస్పిటల్ బిల్లు కూడా పెరిగి గోపాలం భార్య ఒంటిమీద నగలూ, బ్యాంకు బ్యాలెన్సూ రెక్కలొచ్చినట్లు ఎటో ఎగిరిపోయాయి!

* * *

ఆ దినమే భూపాలం కళ్ళుతిరిగి ధామ్మని కిందపడిపోయాడు. భూపాలానికి బాల్యం నుంచీ మూర్ఛ... ఎపిలెప్సీ వంటి వ్యాధులు లేనే లేవని కచ్చితంగా చెప్పవచ్చు! ఎందుకో భూపాలానికి కళ్ళు బైర్లు కమ్మగా... అంతా చీకటిగా అలుముకుని... బుర్రకాయ అస్సలు పని చేయక తన చుట్టూ తాను కాసేపు గిరగిరా తిరిగి... అట్లా తిరుగుతూనే భార్య భానుమతి చుట్టూకూడా కాసేపు గిరగిరా తిరిగి మరీ ఆ పని చేశాడు. భానుమతి లబోదిబోమంది!

అంతకు ముందు రోజే భూపాలం సాయంకాలం ఇంటికి వచ్చీరాగానే ముందు తన చొక్కాని పరపరా బదాబదలుగా చించుకున్నాడు. (ఆ చొక్కల పీలికలతోనే భానుమతి వలవలా ఏడుస్తూ తన కన్నీటి ధారల్ని తుడిచేసుకుంటున్నదని గమనించగలరు) తర్వాత ప్యాంటు జోలికి వెళ్ళాడు గానీ.. అది మరీ దళసరిగా వుండడంతో చించడం సాధ్యపడలేదు. విసిగి కాళ్ళు తపతప బాదుకుంటూ భానుమతిని కావలించుకుని బోరున ఏడుపుకి తగులుకున్నాడు. భానుమతి హడలిపోయి పక్కింటి పిన్నిగార్ని పిలిచింది. ఆవిడ పరిశీలించి గెడ్డం–నోరూ నొక్కుకుని భానుమతి చెవిలో గోప్యంగా 'కచ్చితంగా ఇది గాలే.. కాకపోతే చాతబడి... వుండు–పక్కవీధిలో భూతాచారిని పిలుచుకువస్తా' అని... అంతపనీ చేసింది!

భూతాచారి నిమ్మకాయల తంతూ.. నల్ల కోడి గొంతూ కసిక్కుమనిపించి భీకరమైన మంత్రాలు చప్పుడు చేయకుండా చదివాడు. చివరిసీన్లో తాయెత్తు కట్టబోయే సమయంలో భూపాలం భూతాచారి పిర్రమీద లాగి ఒక తన్ను తన్నాడు... భూతాచారి 'ఇది నా వల్ల కాదంటూ' బజార్న పడి పరుగు లంకించుకున్నాడు. భానుమతి ఖిన్నురాలైంది. ఎంతైనా భానుమతి తాను సైన్సు గ్రాడ్యుయేటునని ఇప్పుడు గుర్తుకువచ్చి వెంటనే సైకియాట్రిస్టు 'రెడ్డి అండ్ రెడ్డి' గారి క్లినిక్‌లో చేర్పించింది.

"ఉహు... మెంటల్ ఇంబ్యాలెన్స్.." అంటూ "ఏమైనా ఏక్సిడెంటు..జారిపడడం జరిగిందా?" భానుమతి తల అడ్డదిడ్డంగా వూపింది. రెండ్రోజులు ఆయనగారు కౌన్సిలింగుచేశాడు. గుళికలు మింగించి సూదులు గుచ్చాడు. వెర్రిచూపులు చూడడం తప్ప మరో ఫలితం లేదు. గోపాలం ఉండుండి ఆర్తనాదాలు చేస్తూ పండ్లు పటపట కొరుకుతున్నాడు. "జర్మనీలో నా ఫ్రెండున్నాడు. వాడికి రిఫర్ చేస్తాను. డయోగ్నొసిస్..ట్రీట్‌మెంటు... అక్కడైతే బెస్టు"

డాక్టరు రెడ్డిగారి మాటలకు భానుమతి కేకపెట్టి మూర్ఛపోయింది!

* * *

ఇంతవరకు యాద్గిరి చెప్తుంటే మల్లేశు –జక్కులోడు నోర్లు బాగా తెరిచి హర్రర్ సిన్మా చూస్తున్నట్లు గొంతుక్కూర్చున్నారు.

"గోపాలం, భూపాలంలకు వచ్చిన బాధలేమిటి? ఎందుకు? కారణాలేమిటి?"

యాద్గిరి మల్లేశులు తెరిచిన నోర్లను టక్కున మూశారు.

"ఒరే అది హెల్మెటు మహాత్మ్యంరా! గోపాలం కిలో బరువున్న హెల్మెటును రెండ్రోజులు పెట్టుకుని అట్లా అయిపోయాడు. హెల్మెటు లేకుండా పోతున్న భూపాలాన్ని దొరకబుచ్చుకుని పోలీసులు పొద్దుట్నుంచీ సాయంత్రం దాకా కౌన్సిలింగు పీకిన పీకుడుకు వాడికట్లా బుర్రలూజయి ఖరాబయింది."

జక్కులోడు నవ్వీనవ్వీ వెనక్కి విరుచుకుపడ్డాడు. ✤

మందుల వల్ల మధుమేహం

డా॥ ఎన్.వెంకట రమణ

మానవ శరీరంలో పాంక్రియాస్ గ్రంథి ఇన్సులిన్ గ్లూకగాన్ హార్మోనులను స్రవించడం ద్వారా రక్తంలో సుగర్ శాతం నియంత్రించబడుతుందని మన అందరకు తెలిసిన విషయమే. గ్లూకగాన్ రక్తంలో సుగర్ శాతాన్ని అవసరాన్ని బట్టి పెంచడంలో తోడ్పడతాయి. ఇన్సులిన్ రక్తంలోని సుగర్ శాతాన్ని కణజాలం వినియోగించుకునేలా చేసిన రక్తంలోని సుగర్ శాతం తగ్గించేయడంలో దోహదపడతాయి.



పాంక్రియాస్ గ్రంథిలో ఈ హార్మోనులు స్రవించడంలో అసాధారణతలు, హార్మోనులకు రెసిస్టెన్స్ వచ్చి పనిచేయకపోవడం వంటి కారణాల వల్ల రక్తంలో సుగర్ అదుపు తప్పడం జరుగుతోంది. అయితే వివిధ వ్యాధులకు వాడే కొన్ని రకాల మందులు కూడా మధుమేహానికి (హైపర్ గ్లైసీమియా) కారణమవుతాయని పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. ఇవి రెండు విధాలుగా 'హైపర్ గ్లైసీమియా'కు కారణం కావచ్చును. వ్యాధులకు వాడే మందులు ప్రత్యక్షంగా పాంక్రియాస్ పై ప్రభావం చూపవచ్చును. మధు మేహ బాధితులు అయిన తర్వాత, ఇతర వ్యాధులకు వాడే మందుల వల్ల మధుమేహం అదుపు తప్పవచ్చును. మధుమేహ నియంత్రణకు వాడుతున్న మందులపై ఈ మందులు ప్రభావం చూపవచ్చును. లేదా హైపర్ గ్లైసీమియాకు కారణమయిన మధుమేహానికి వాడుతున్న మందులు రక్తంలో సుగర్ శాతం నియంత్రించడంలో విఫలమయ్యేలా చేయవచ్చును. ఏది ఏమైనా మనం వాడే అనేక రకాల మందులు రక్తంలోని సుగర్ శాతంపై ప్రభావం చూపుతాయన్నది స్పష్టం. ఆ మందుల గురించి తెలుసుకొని వాడకంలో జాగ్రత్తలు పాటించడం అవసరం. మధుమేహం కలిగించడానికి అవకాశం గల మందులలో పేర్కొనదగినవి.

1. హార్మోన్‌లు: మన శరీరంలో అనేక హార్మోన్‌లు ఉంటాయని మన అందరకు తెలిసిన విషయమే. ఈ హార్మోన్‌లలో లోపాలు లేదా అసాధారణతలు వచ్చినప్పుడు వాటిని వాడడం జరుగుతుంది. కొన్ని వ్యాధుల చికిత్సలోను వాటిని వాడడం జరుగుతోంది. వీటిలో గ్లూకగాన్, గ్రోత్ హార్మోన్, ఆండ్రోజెన్స్, కార్డికో స్టెరాయిడ్స్, గర్భనిరోధక మాత్రలు పేర్కొనదగినవి.

2. హృదయ సంబంధ వ్యాధులకు వాడే మందులు: వీటిలో ఎడ్రినలీన్, నాన్ ఎడ్రినలీన్, క్లోనిడిన్, డైయురెటిక్స్, థయాజైడ్ వంటి మందులు పేర్కొనదగినవి.

3. మెదడు, నరాల సంబంధ వ్యాధులకు వాడే మందులు: వీటిలో ఫినటోయిన్, ఎట్రోఫీన్, లివోడోపా పేర్కొనదగినవి.

4. ఊపిరితిత్తుల వ్యాధులకు వాడే మందులు: వీటిలో థియోఫిలిన్, రిఫాంఫిసిన్, సాల్‌బుటమాల్ పేర్కొనదగినవి. ఇంకా సైక్లోస్పోరిన్, నియాసిన్, నాలివిడిక్సిక్ యాసిడ్ మొదలయిన మందులు కూడా రక్తంలో సుగర్ శాతాన్ని పెంచుతాయి.

రక్తంలో సుగర్ శాతాన్ని ఎలా పెంచుతాయి?

ఒక్కోమందు ఒక్కో విధంగా రక్తంలోని సుగర్‌పై ప్రభావం చూపుతుంది. కొన్ని మందులు జీర్ణాశయంలో సుగర్ శోషణాన్ని పెంచుతాయి. కొన్ని మందులు కాలేయంలో, కండరాలలో నిల్వ ఉన్న సుగర్‌ను మొబిలైజ్ చేసి రక్తంలోకి వచ్చేలా చేస్తాయి. కొన్ని మందులు కార్బో హైడ్రేటు కాని పదార్థాల నుండి సుగర్‌ను ఉత్పత్తి చేసేందుకు దోహదపడతాయి. ఈ ప్రక్రియనే శాస్త్రీయ పరిభాషలో 'గ్లూకోనియాజెనిసిస్' అని పేర్కొంటారు. మరికొన్ని మందులు ఇంతకు ముందే ప్రస్తావించినట్టుగా పాంక్రియాస్‌లో ఇన్సులిన్ స్రవించడాన్ని నిరోధిస్తాయి. పాంక్రియాస్‌ను డామేజ్ చేస్తాయి. ఇంకొన్ని మందులు ఇన్సులిన్ సరైన పద్ధతిలో, సరిపోను స్రవిస్తున్నా... ఆ ఇన్సులిన్ క్రియాత్మకతలో మార్పులు తెచ్చి రెసిస్టెన్స్‌కు కారణ మవుతాయి. ఇలా ఒక్కో మందు ఒక్కో విధంగాను, కొన్ని మందులు కొన్నిటి కంటే ఎక్కువ విధాలుగా కూడా పనిచేసి రక్తంలో సుగర్ శాతాన్ని పెంచడానికి దోహదపడతాయి. మందుల వాడకంలో జాగ్రత్తలు అవసరం అనేది స్పష్టమవుతోంది. క్వాలిఫైడ్ వైద్యుని సలహాలేకుండా ఎలాంటి మందులు వాడడం మంచిదికాదు. అలా వాడితే అవి భవిష్యత్తులో మిమ్మల్ని మధుమేహ బాధితుల్ని చేయవచ్చును. అలానే మధుమేహ బాధితులు సుగర్ మందులను, ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు వాడే మందులను వైద్యుని పర్యవేక్షణలోనే వాడాలి. అవసరమయిన మోతాదులలోనే వాడాలి. మధుమేహ బాధితులు, రక్తంలో సుగర్ శాతాన్ని పెంచే ఇతర మందులు వాడుతున్నప్పుడు, సుగర్ మందుల మోతాదులో మార్పులు చేయడం మంచిదికాదు. మందుల మోతాదు పెంచడం, ఇన్సులిన్ పెంచడం కాకుండా, రక్తంలో సుగర్ శాతాన్ని పెంచేందుకు దోహద పడుతున్న మందుల విషయంపై దృష్టి సారించాలి. మోతాదుల్లో మార్పులు చేయాలి. లేదా మందులను అవసరాన్ని బట్టి మార్చడం మంచిది. రోజు రోజుకు మనదేశంలో మధుమేహ బాధితులు పెరిగిపోతున్న ప్రస్తుత పరిస్థితులలో మందుల వల్ల వస్తోన్న మధు మేహాన్ని నిరోధించవలసిన అవసరం ఎంతో ఉంది. క్వాలిఫైడ్ వైద్యుని సలహా లేకుండా విచక్షణా రహితంగా మందులు వాడటం ప్రమాదకరం. శరీరానికి ఇచ్చే ఏ మందైనా రెండు వైపులా పదునున్న కత్తిలాంటిదన్న శాస్త్రీయ వాస్తవాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించి మెలగాలి.

సాధారణ జ్వరాలు

కొన్ని జాగ్రత్తలు

డా॥ పి. దక్షిణామూర్తి

ప్రతివారికి ఎప్పుడో ఒకప్పుడు జ్వరం రాకుండా ఉండదు. జ్వరాల్లో అనేక రకాలు ఉంటాయి. 2 నుండి 5 రోజుల్లో తగ్గిపోయే 'ఫ్లూ' వంటి వైరస్ జ్వరాల నుంచి వారాల తరబడి పీడించే జ్వరాలూ ఉంటాయి.

శరీరం మామూలు ఉష్ణోగ్రత 96.4 నుండి 98.4 డిగ్రీల ఫారన్‌హీట్ (36.5 నుండి 37.5 డిగ్రీల సెంటీగ్రేడ్) ఉంటుంది. శరీర ఉష్ణోగ్రత అంటే శరీరంలోని అవయువాలు, ధాతువుల ఉష్ణోగ్రత (వేడిమి లేక చల్లదనం). వేడి ఉత్పత్తి అవటానికి వేడి తగ్గిపోవటానికి మధ్య సమతౌల్యాన్ని పాటించడం ద్వారా మెదడులోని 'హైపోథాలమస్' శరీర ఉష్ణోగ్రతను మామూలు స్థితిలో ఉంచుతుంది.

జ్వరాన్ని కొలిచే సాధనాన్ని 'థర్మామీటర్' అంటారు. ఉపయోగించే ముందు థర్మామీటర్‌ను 95 డిగ్రీల ఫారన్ హీట్ వచ్చేదాకా విదిలించాలి. ఉష్ణోగ్రత తెలుసుకోవడానికి థర్మామీటరును నోట్లోగాని, చంకలోగాని ఉంచి కొలుస్తారు. పిల్లల్లోను, మగతగా ఉన్నవారిలోను చంకలో పెట్టి కొలుస్తారు. చంకలో ఉష్ణోగ్రత నోటిలో ఉష్ణోగ్రత కంటే ఒక డిగ్రీ ఫారన్‌హీట్ (అరడిగ్రీ సెంటిగ్రేడ్) తక్కువ ఉంటుంది. థర్మామీటరు బల్బును నాలుక క్రిందగాని, చంకలోగాని కనీసం ఒక నిముషం అన్నా ఉంచాలి. ఉపయోగించిన తరువాత థర్మామీటర్‌ను చన్నీటితో కడిగి ఆరబెట్టాలి.

శరీర ఉష్ణోగ్రత సాధారణంగా రోజు మొత్తం మీద రెండు డిగ్రీల ఫారన్‌హీటు అటూఇటుగా మారుతూ ఉంటుంది. తెల్లవారుఝూమున 2-3 గంటల మధ్య ఉష్ణోగ్రత కనీస స్థాయిలోను, మధ్యాహ్నం పూట గరిష్ట స్థాయిలోను ఉంటుంది.

జ్వరం ఒక వ్యాధి లక్షణం మాత్రమే. జ్వరానికి అనేక కారణాలు ఉన్నాయి. వీటిలో క్రిమిదోషాలు (ఇన్‌ఫెక్షన్) ముఖ్యమైనవి. బాక్టీరియా (ఉదా: న్యుమోనియా, టైఫాయిడ్, క్షయ) వైరస్ (ఉదా: ఇన్‌ఫ్లూయంజా, డెంగ్యూ ఫీవర్, గవద బిళ్ళలు) పరాన్న భుక్కులు (పేరాసైట్స్ ఉదా. మలేరియా), ఫంగస్ రికెట్సియా మొదలైన వివిధ రకాలైన క్రిములు జ్వరాలను కలిగిస్తాయి. రక్తం ఎక్కించినప్పుడు, నరంలోకి ఇంజక్షన్ చేసినప్పుడు జ్వరం రావచ్చు. వడదెబ్బ, ఔషధాల ఎలర్జీ వల్ల కూడా జ్వరం రావచ్చు. 'లుకేమియా' 'లింఫోమా' వంటి క్యాన్సర్ వ్యాధుల్లో కూడా జ్వరం రావచ్చు.

జ్వరంతో పాటు ఉండే ఇతర లక్షణాలను బట్టి అవసరమైన రక్త పరీక్షలు, ఇతర పరీక్షలను బట్టి జ్వరానికి కారణాన్ని నిర్ణయించి డాక్టర్ తగు చికిత్స చేస్తారు. అనేక పరీక్షలు చేసిన తరువాత కూడా మూడు వారాల కంటే ఎక్కువ కాలం జ్వరం ఉంటే (కారణం కనబడని జ్వరం) కొన్ని ప్రత్యేక పరీక్షలు చేయవలసి ఉంటుంది. జ్వరం ఏదో విధంగా తగ్గిపోవాలని రోగులు కోరుకోవడంలో ఆశ్చర్యం లేదు. 'కార్టికోస్టిరాయిడ్' ఇంజక్షన్ వల్ల జ్వరం పైకి తగ్గినట్టు కనపడినా, వ్యాధిలోపల పెరుగుతూ ఉంటుంది.

జ్వరంతో బాధపడుతున్న రోగికి మామూలు మనిషి కంటే ఎక్కువ కేలరీల ఆహారం అవసరం. సరైన అవగాహనలేక జ్వరం వచ్చిన రోగికి ద్రవపదార్థాలు కూడా ఇవ్వకుండా మాడ్చటం సరికాదు. నోరు చేదు వల్ల, ఆకలి లేనందువల్ల, రోగి విముఖంగా ఉన్నా, రొట్టె వంటి తేలికగా అరిగే ఆహారం, పాలు, మజ్జిగ, గ్లూకోజ్, కొబ్బరినీళ్ళు, హార్లిక్స్ వంటి వాటిని తరచూ తీసుకునేటట్లు చూడాలి. 'ఫ్లూ' వంటి కొద్ది జ్వరాల్లో తేలికగా భోజనం చేస్తే నీరసం, నిస్రాణ ఉండవు. వాంతులు అవుతుంటే, అవసరమైతే సెలైన్ సీసాలు ఎక్కిస్తారు.

క్షయ (టి.బి.) వంటి వ్యాధుల్లో చికిత్స ప్రారంభమైన తరువాత కూడా కొన్ని రోజులు రోజూ సాయంత్రం స్వల్పంగా జ్వరం వస్తుంది. ఇలాంటి వ్యాధుల్లో పుష్టికరమైన ఆహారం తీసుకోవాలని చెప్పినా కొంతమంది అపనమ్మకాలతో తగిన ఆహారం తీసుకోకపోవడం మంచిది కాదు. టైఫాయిడ్ వంటి జ్వరాల్లో ఘనపదార్థాలు కాకుండా ద్రవ పదార్థాలు మాత్రమే తీసుకోవాలి. కొంతమంది జ్వరం తగ్గగానే 'యాంటీబయాటిక్' మందులను ఆపివేస్తారు. జ్వరం తగ్గాక కూడా డాక్టర్ సలహా ప్రకారం 5 నుంచి 7 రోజులు, అవసరమైతే మరికొన్ని రోజులు మందులు వాడాలి.

పొంగు, ఆటలమ్మ వంటి వ్యాధుల్లో పోత పోసిన తరువాత ఏ మందులూ వాడకూడదని, వాడితే ప్రమాదమని కొంతమంది మూఢంగా విశ్వసిస్తారు. ఈ వ్యాధుల్లో 'బ్రాంకోన్యుమోనియా' వంటి కాంప్లికేషన్లు రాకుండా ఉండాలంటే మందులను వాడాల్సిందే. వైద్య విజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందిన ఈ రోజుల్లో కూడా మశూచి, ఆటలమ్మ వంటి వ్యాధులు 'దేవతల' కోపతాపాల వల్ల వస్తాయని నమ్మే ప్రజలు ఉండటం ఆశ్చర్యమే. 1977 నుంచి మశూచి వ్యాధి ప్రపంచం నుంచి పూర్తిగా నిర్మూలించబడటం వైద్యశాస్త్రం సాధించిన ఘన విజయం.

శాస్త్రీయంగా నిరూపించబడిన వైజ్ఞానిక సత్యాలనే ప్రజలు విశ్వసించాలి గానీ, మూఢ విశ్వాసాల చీకటిలో చిక్కుకోకూడదు. కొద్ది జ్వరాల్లో కూడా స్నానం చేయకూడదనే అపనమ్మకం ప్రజల్లో ఉంది. రోగి బలహీనంగా ఉంటే శరీరం అంతటా గోరువెచ్చని నీటితో తుడవవచ్చు. జ్వరం తీవ్రంగా ఉన్నప్పుడు వైద్యుని సలహాపై 'పారాసెటమాల్' వంటి మందులను వాడాలి. చిన్న పిల్లల్లో జ్వరం ఎక్కువగా ఉన్నప్పుడు 'మంపులు' రావచ్చు. జ్వరం తగ్గడానికి తడి గుడ్డతో ఒళ్ళంతా తుడవాలి. చిన్న జ్వరమైనా, పెద్ద జ్వరమైనా సొంతవైద్యం, నాటు వైద్యం పాటించకుండా కుటుంబ వైద్యుని సంప్రదించాలి. ❖

మిసెస్ అండర్‌స్టాండింగ్ మాత్రమే కాదు

సరోజిని

పుస్తకం పేరు చూడగానే ఇదేదో ఆడవాళ్ళకు సంబంధించినట్లుగా అన్పిస్తుంది. అయితే చదివిన తరువాత అసలు విషయం మనకు అర్థమవుతుంది. ఇందులో "మిస్టర్ అండర్‌స్టాండింగ్" కూడా ఎక్కువగానే మనకు దర్శనమిస్తాడు. ఎందుకంటే రచయిత ఎక్కువ తన సరస్వతిని గురించి చెప్పుకున్నప్పటికీ ఆమెను తనకు అనుకూలంగా, తాను ఆమెకు అనుకూలంగా ఉండేందుకు ఉపయోగించిన చిట్కాలు కూడా ఇందులో పొందుపరిచారు. ఇది ఒక్క సరస్వతి, రచయితల సంసారానికి సంబంధించిన విషయం మాత్రమే కాదు. మెజారిటీ సంసారాల సరాగాలు కూడా అందులో దర్శనమిస్తాయి.

భార్యాభర్తల మధ్య వచ్చే గిల్లి కజ్జాలను పెద్దవి చేసుకొని ఓ మహా సంగ్రామంగా మార్చుకోకుండా ఎలా పరిష్కరించుకోవచ్చో రచయిత కొన్ని చోట్ల చక్కగా, సున్నితంగా వివరించారు. సంక్రాంతి పండుగ అంటేనే పల్లెల్లో అదో సందడి. పడుచు పిల్లలు అర్ధరాత్రి వరకు ఇంటి ముందర పరిచే రంగవల్లులు, కాలేజీ సెలవులకు వచ్చే కుర్రకారు చేసే చిలిపి చేష్టలను వివరించిన తీరు బాగుంది. వరసైన మరదళ్ళను బావలు, బావలను మరదళ్ళు ఆటపట్టించే ఘట్టాలు మనకు 'సంకురాత్రుళ్ళు'లో కళ్ళకు కడతాయి.

'పుట్టిల్లు'లో భార్య పుట్టింటికి దగ్గరగా ఉంటే అనేక ఇబ్బందులు పడాల్సి ఉంటుందంటారు రచయిత. అయితే భార్యను ఆమె పుట్టింటికి దూరంగా ఉంచాలంటే వయస్సులో ఉన్న మరదలితో కొంత ఓవర్ యాక్షన్ చేయడం అవసరమా అని ఒకింత అనుమానం రాకమానదు. 'పొద్దుటి పోట్లాట రాత్రికి, రాత్రి పొరపొచ్చరం పొద్దుటికి సమసి పోవాల'ంటారు రచయిత తన 'దుర్‌విధి'లో. 'కొంతసేపు కోపతాపాలు కొరివికారంలా మహరుచిగా ఉంటాయి. తర్వాత మీగడ పెరుగు తినాలి! ఆలస్యం చేయగూడదంటారు' రచయిత ఇందులో. నిజమే కదా! చిన్న తగాదాలను అంతే త్వరగా మర్చిపోతే ఇద్దరికీ మంచిదే.

దసరా, సంక్రాంతి, దీపావళి క్లియరెన్స్ సేల్‌లో సగం రేటుకే కొనే చీరలు ఎలా తగలడతాయో 'దసరా చీర'లో చక్కటి చురకలంటిస్తారు రచయిత. ఇలాంటి క్లియరెన్స్ సేల్స్‌లో జాగ్రత్తగా వ్యవహరించాలనేది బహుశా రచయిత ఉద్దేశం కావచ్చు. కాలేజీ కుర్రాళ్ళు ప్రేమ పేరుతో తమ చదువును ముదనష్టం చేసుకొని చివరకు జీవితాలనే నాశనం చేసుకోవద్దనే సందేశం మనకు 'ఉల్లకల్లోలం'లో కన్పిస్తుంది. చదువుకునే వయస్సులో చదువు మీదే మనస్సు పెట్టడం మంచిదనేది ఇందులో సారాంశం.

ఇప్పటి అమ్మాయిలు, అబ్బాయిలు ఎంత త్వరగా ప్రేమల్లో పడిపోతున్నారో 'ఐ లవ్ యూ, ఐ టూ డిటో'లో వివరించారు. ఇలా ప్రేమల్లో పడకుండా ఏ సినిమా నటుణ్ణో ప్రేమించడం మంచిదంటారు రచయిత గారు. అదైతే ఎలాంటి ఇబ్బంది లేని విషయమంటారు. అంటే నేటి సినీ నటుల ఫ్యాన్లన్న మాట. పెళ్లయిన రోజు వాకిట పేరు చెప్పే దగ్గర నుంచీ భార్యను జీవితంలో ఒక్కసారి కూడా పేరు పెట్టి పిలవని పతుల వైనాన్ని 'భామ నామాలు'లో వివరించారు. చివరకు ఆ ఇంతి తన పేరునే మర్చిపోయే స్థితి కల్పించే పతులు కూడా మనకు దర్శనమిస్తుంటారు కదా. ఇదే విషయాన్ని ఇందులో వివరించారు. ఇలా భార్య పేరు భర్త, భర్త పేరును భార్య ఉచ్చరించని స్థితి ఇప్పుడు లేదనుకోండి. ఒకప్పుడు పల్లెల్లో మనకు ఎక్కువగా ఈ పరిస్థితి కన్పించేది. మన బామ్మలు, తాతలు ఇక్కడ తప్పక గుర్తొస్తారు.

మొత్తం మీద పుస్తకంలోని ఒక్కో అంశం తడిమిన తీరు చాలా చక్కగా ఉంది. పుస్తకం మీది బొమ్మను చూస్తే కుటుంబంలో ఇద్దరూ సమానం. నీవో సగం, నేనో సగం అన్నట్టుగా ఉంది. రచయిత బ్నిం గారి గురువుగారు బాపూగారి బొమ్మలు కథలకు తగిన విధంగా ఉన్నాయి. కథ రాశాక బొమ్మ వేశారా లేక బొమ్మ వేసిన తరువాతనే కథ రాశారా అనేంత సమన్వయం ఉంది. గురు-శిష్య, శిష్య-గురు సంబంధం బ్నిం-బాపూ, బాపూ-బ్నింగా ఈ పుస్తకంలో దర్శనమిచ్చింది.

ఈనాడు మనకు విధిగా ప్రతీ పుస్తకంలో కన్పించే అచ్చు తప్పులకు ఈ పుస్తకం కూడా మినహాయింపు కాదు అన్పిస్తుంది. మరీ ఎక్కువగా తప్పులు లేనప్పటికీ ఉన్న కొంచెమైనా పంటికింది రాయిలా కొంత అసౌకర్యాన్ని కల్గించాయి. సరదాగా చదువుకోవడానికి బాగుండే పుస్తకమని చెప్పక తప్పదు. పుస్తకం వెల కొంచెం ఎక్కువే అన్పించింది. ❖



మిసెస్ అండర్‌స్టాండింగ్,
రచన: బ్నిం,
వెల: 65 రూపాయలు,
ప్రతులకు: నవోదయ, విశాలాంధ్ర బుక్ హౌస్‌లు, బి. ముకుంద్, 12-11-448, వారాసిగూడా, సికింద్రాబాద్ - 500 061.

శ్రీకారం

అంతరంగ తరంగాలు
(స్మృతి రేఖలు)
రచన : తోటపల్లి లక్ష్మణ కుమార్
ప్రతులకు : తోటపల్లి లక్ష్మణ కుమార్, సీనియర్ సహాయకులు మండల పరిషత్ కార్యాలయము, రొంపిచర్ల (పోస్టు & మం), గుంటూరు జిల్లా

శ్రీ గూడవల్లిరామబ్రహ్మం
రచన : డాక్టర పాటిబండ్ల దక్షిణామూర్తి
వెల : రూ. 48/-; ప్రతులకు : పి. రంగనాథ గుప్త, 6-6-33, మెయిన్‌రోడ్, తెనాలి.

కవితాక్షరం
రచన : బద్ది నాగేశ్వరరావు
వెల : రూ. 25/-; ప్రతులకు : బద్ది నాగేశ్వరరావు, డి.నెం. 13-9-5, గోలి స్ట్రీట్, దేమునిగుమ్మం, అనకాపల్లి; బుక్స్ అండ్ బుక్స్, విద్యానగర్, ఎలమంచిలి; ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు; విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు,

అభివృద్ధికి నోచుకోని లక్ష్మీ నృసింహ క్షేత్రం

యాసలపు సూర్యారావు



తూర్పు గోదావరి జిల్లాలో గల ప్రసిద్ధ పుణ్యక్షేత్రాల్లో చెప్పుకోదగ్గది కోరుకొండ శ్రీలక్ష్మీ నృసింహ క్షేత్రం. దీనిని దర్శించేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు నిత్యం వస్తూనే ఉంటారు. ఈ ఆలయంలో శ్రీవైష్ణవ సంప్రదాయం ప్రకారం అధ్యయనోత్సవాలు, ఆళ్వారుల తిరునక్షత్రములు, ఇతర దేవుళ్ల కళ్యాణోత్సవాలు, ధనుర్మాసోత్సవాలు, శ్రీరామనవమి, కృష్ణాష్టమి మొదలగు నిత్య పూజలు జరుగుతూ ఉంటాయి. ఏకాదశార్చనలు, భోగాలు, రథోత్సవాలు జరుగుతాయి. ఫాల్గుణ శుద్ధ ఏకాదశినాడు శ్రీలక్ష్మీ నృసింహ స్వామి కళ్యాణోత్సవం కొత్త కళ్యాణ మండపంలో జరుగుతుంది. ఆ రోజులలోనే శ్రీరంగ రాజస్వామి కోవెలలో విశిష్ట ద్వైతమత ప్రచార సభలు జరుగుతాయి.



రాష్ట్రమంతటి నుంచి ప్రఖ్యాతి నొందిన పండితులు అనేకులు వస్తారు. ఆనాటి పండుగ రోజులలో ఆ చుట్టు పక్కల గ్రామాలన్నీ బంధువులతో కళకళలాడిపోతాయి. కన్నుల పండువగా ఉంటుంది. కోరుకొండను రాజధానిగా చేసుకొని మంచికొండ రెడ్లు పాలించారు. క్రీ.శ. 1325-1395 కాలంలో ఈ జిల్లా అంతటినీ పాలించారు. వీరి కాలంలోనే కోరుకొండ శ్రీలక్ష్మీ నృసింహ క్షేత్రం బాగా ప్రసిద్ధి నొందింది. రెడ్డిరాజుల్లో కేశవ నాయకుడు మొదటివాడు. తర్వాత అతని కొడుకు గణపతినాయుడు క్రీ.శ. 1325-1340 ఇరువది ఎకరాల స్థలంలో పూర్తిగా కందకం బురుజులతో ఒక మట్టికోటను కట్టించారు. అది నేడు పూర్తిగా రూపు మాసిపోయింది.

లక్ష్మీ నృసింహ స్వామి ఆలయం రాజమండ్రి పట్టణానికి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న కోరుకొండలో ఉంది. త్రిభుజాకారంలో ఉన్న కోరుకొండపై నిర్మించిన దేవాలయం ఇది. ప్రతి ఏటా వేసవికాలం ఆరంభంలో అత్యంత వైభవంగా తీర్థం జరుగుతుంది. కొండపై గల దేవుని దర్శించాలంటే భక్తులు ఆరు వందల మెట్లను ఎక్కి పైకి నడవాలి. కొండపై ఆళ్వారుల మందిరం, ధ్వజ స్తంభం ఉన్నాయి. ఎడమ పక్కన ప్రాచీన కళ్యాణ మండపం ఉంది. దీనికి ఇరువైపులా శిలాశాసనాలు కలిగి వున్నాయి. కొండచుట్టూగల వైశాల్యం సుమారు 45 ఎకరాలు. కళ్యాణం రోజున జరిగే రథోత్సవం ప్రసిద్ధి చెందింది. రథం నడుస్తున్నంత సేపూ భక్తులు అరటి పళ్ళు, బెల్లం కుందులను విరివిగా రథం పైకి విసిరి మొక్కులు తీర్చుకోవటం ఇక్కడ భక్తుల ఆచారం. పండుగ దినాలలో ఇక్కడ అనేక చిన్నా, చితకా వ్యాపారాలనేక ఇక్కడ వెలుస్తాయి.

కోరుకొండ నృసింహ స్వామి ఆలయంగల కొండచుట్టూ ఎటుచూసినా భక్తులకు కనువిందు చేస్తూ ప్రకృతి సౌందర్యం కళకళలాడుతుంది. చుట్టూ కనుచూపు మేర గొలుసు కట్టుగా ఉన్న ఎత్తయిన పర్వతాలు పచ్చదనం ఉట్టిపడే ఎత్తయిన, దట్టమయిన వృక్షసంపదతో అహ్లాదాన్ని కలిగిస్తాయి. ఉదయ సంధ్యవేళలో మంచు తెరలను చీల్చుకుంటూ గర్భగుడిని తాకుతున్న అరుణోదయ కిరణాలు తిలకించినపుడు చూపరుల హృదయం ఉప్పొంగిపోతుంది. గర్భగుడి చుట్టూ అమర్చిన ప్రాచీన శిల్ప కళా నైపుణ్యం, ఆళ్వారుల ప్రతిభా పాటవానికి ప్రబల తార్కాణం. ఆలయానికి తూర్పు దిక్కుగా కలువ పూల కొలను మనోల్లాసాన్ని కల్గిస్తుంది. కొండ దిగువన కూడా వివిధ దేవాలయాలు భక్తుల సౌకర్యార్థం నిర్మించారు. అనేకులు కొండెక్కే సాహసం చేయరు. కొండ దిగువనే ఉన్న దేవుళ్లను దర్శించుకుని వెళ్లిపోవటం జరుగుతుంది. ప్రభుత్వంగానీ, పర్యాటక శాఖవారుగానీ, ఈ క్షేత్రం అభివృద్ధిని కాంక్షించినట్టయితే కొండపై కాలినడకనగానీ, వాహనాల ద్వారాగానీ వెళ్లే విధంగా మరో ఘాట్‌రోడ్‌ను నిర్మిస్తే ఈ క్షేత్రం ఎంతో అభివృద్ధి చెందే అవకాశం ఉంది.. అలాగే దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఉండేందుకు కాటేజీలు నిర్మించటం కూడా చేయాల్సి ఉంది. పావన గోదావరీ తీరానికి అతి చేరువలో ఉన్న కారణంగా దీనికి బాగా అభివృద్ధి చెందడానికి అవకాశాలున్నాయి. తూర్పుగోదావరి జిల్లాలోని ముఖ్య పట్టణాలయిన కాకినాడకు, అటు రాజమండ్రికి చేరువలో ఈ క్షేత్రం వెలసినది. కావున భక్తులకు అందుబాటులో ఉండే విధంగానే ప్రభుత్వం సౌకర్యాలను కల్పించగలిగితే మంచిది.

8.12.04న
మృతి చెందిన
సి.ఎస్.రావు స్మృతిలో

అద్భుతమైన టెక్నిక్‌ని తన సినిమాల్లో చూపగల్గిన దర్శకులు చిత్తజల్లు శ్రీనివాసరావు. సి.ఎస్.రావు, సినిమా సక్సెస్‌రావుగా దక్షిణాదిన ఆయన నెరుగని వారుండరు. మన చలన చిత్రసీమలో తొలితరం దర్శకులైన హెచ్.ఎమ్.రెడ్డి, ప్రకాష్, సి.పి.పుల్లయ్య, జెమినీ వాసన్ వంటి మహనీయుల తరం వారు ఈ సి.ఎస్.రావు

సినీ సక్సెస్ రావు సి.ఎస్.రావు

హెచ్.రమేష్ బాబు

తొలి తెలుగు సినీ దర్శకుల్లో ఒకరైన సి.పుల్లయ్య తొమ్మిదో సంతానంగా 1924 మే 1న కాకినాడలో జన్మించారు. వీరికన్నా ముందు ఎనమండుగురు సంతానంలో పుట్టిన వెంటనే గతించడంతో బోడిబాబు అనే పేరుతో అంతా ముద్దుగా పిలుచుకునే వారు. తండ్రి దర్శకుడవటంతో ఆయన తీసిన 'సతీ అనసూయ', 'ధృవవిజయం' సినిమాలతో దేవేంద్రుడి వేషం వేసి బాల నటునిగా సినీరంగ ప్రవేశం చేశారాయన. మళ్ళీ సినిమాలకు దూరమై విద్యాభ్యాసం చేస్తున్నపుడే పదో ఏట 'సతీసావిత్రి'లో సత్యవంతునిగా వేషం వేశారు. హైస్కూలుకు వచ్చేసరికి 'మెరుపు' లిఖిత మాసపత్రికను ప్రారంభించి దాని నిర్వహణ కోసం 'నవగ్రహకూటం' నాటకం రాసి ప్రదర్శించారు. బి.ఎ. ఆంగ్లంలో పట్టానందుకుని, కలకత్తా విశ్వవిద్యాలయంలో లెక్చరర్ ఉద్యోగానికి వెళ్ళే సమయంలో తండ్రిగారైన సి.పుల్లయ్య ఇన్ని రంగాల్లో ప్రావీణ్యం గల నీవు సినిమాలో ఉండటంఎం ఎంతైనా అవసరం. సినీ రంగంలోకి ప్రవేశించమని చెప్పడంతో ఆయన సినీ జీవితం ప్రారంభమైంది.

1946లో జెమినీ సంస్థలో చేరి, తొలిసారిగా ఉదయశంకర్ తీసిన 'కల్పన' చిత్ర నిర్మాణంలో దర్శకత్వ శాఖలో పని నేర్చుకోసాగారు. 'మంగళ', 'అపూర్వ సహోదారులు' వంటి చిత్రాలకు సహదర్శకునిగా పని చేశారు. వాసన్‌గారు ఇతడికి చాలా విషయాలను దగ్గరుండి నేర్పించారు.

సి.ఎస్.రావు మొదటిసారిగా దర్శకత్వం వహించినది తమిళ చిత్రానికి. ఆ



చిత్రం పేరు 'సోనమచ్చాన్ తిరుంచి వందాన్' తెలుగులో చేసిన తొలి చిత్రం 'శ్రీకృష్ణతులాభారం' (1955). రెండవ చిత్రం రాజరాజేశ్వరి వారి 'అన్న-తమ్ముడు', తరువాతి 'మంచిమనసుకు మంచిరోజులు' 1958లో వచ్చాయి. 1959లో హిందీ సినిమా బడాభాయి. ఆధారంగా 'శభాష్‌రాముడు' తీశారు. వీటిలో హీరో రామారావు గారు. 1960లో వచ్చిన 'శాంతినివాసం' అఖండ విజయంతో సినీసక్సెస్‌రావుగా పరిశ్రమ అభినందించింది. ఆ తరువాత వచ్చిన 'పెళ్ళికాని పిల్లలు', 'శభాష్‌రాజా', 'కృష్ణప్రేమ', 'టైగర్ రాముడు' చిత్రాలు ఆయనకు మరింత పేరు తెచ్చిన చిత్రాలు. తండ్రి సి.పుల్లయ్య అనారోగ్య కారణంగా చాలాకాలం పాటు నిర్మాణం పూర్తికాకుండా ఉండిపోయిన లలితా శివజ్యోతి వారి 'లవకుశ'ను తన దర్శకత్వంలో పూర్తి చేసి 1963లో విడుదల చేశారు. ఈ సినిమాలో సి.పుల్లయ్య సి.ఎస్.రావుల దర్శకత్వ ప్రతిభ ఎన్.టి.ఆర్., అంజలి, కాంతారావు, నాగయ్యల నటన నభూతోనభవిష్యతి. ఇప్పటికీ ఈ చిత్రం ఎక్కడ విడుదలైనా హౌస్‌ఫుల్ కలెక్షన్లతో ఆడటం గొప్ప విషయం. వాల్మీకిగా నాగయ్య నటనను చూసి ఒక్క పెట్టున ఉద్వేగంతో విలపించారాయన. రామాయణ కాలంలో తాటి చెట్లు లేవని వాటిని స్టూడియోలో కొట్టివేయించి చిత్రీకరణ జరపడం రావుగారి గొప్పతనానికి నిదర్శనం.

ఈ నేపథ్యంలో జగ్గయ్య-జమునలు హీరోహీరోయిన్లుగా హైదరాబాద్ మూవీస్ వారి 'కీలుబొమ్మలు', 'ప్రచండ భైరవి', 'కృష్ణమాయ', 'అభిమానం', 'గ్రామదేవతలు', నిలువు దోపిడి', 'పెత్తందార్లు', మళ్లీపెళ్ళి', 'మారిన మనిషి', ఒకే కుటుంబం', 'రంగేలీరాజా', 'జీవితచక్రం', భాగ్యవంతుడు', 'కృష్ణాంజనేయ యుద్ధం', 'దేశోద్ధారకులు', 'ధనమా దైవమా', 'అనగనగా ఒక తండ్రి', 'ఆడంబరాలు అనుబంధాలు', 'యశోదాకృష్ణ', 'మహాకవి క్షేత్రయ్య', 'దేశమంటే మనుషులోయ్' వంటి తెలుగు చిత్రాలే గాక తమిళ, కన్నడ చిత్రాలను సైతం డైరెక్ట్ చేశారాయన.

సి.ఎస్.రావు వద్ద వి.రామచంద్రరావు, పి.సాంబశివరావు, ఆమంచర్ల శేషగిరిరావు మొదలైన వారు శిష్యరికం చేసి ఉత్తమ దర్శకులుగా ఎదిగారు. ఆయన పౌరాణికాలు, సాంఘీకాలు, చారిత్రకాలు, జానపదాలు ఇలా రకరకాల చిత్రాలను రూపొందించడంలో తిరుగులేని



మల్లు వెంకట నర్సింహా... పీడితజన ఉద్యమ బ్రహ్మా!

సాకీ: మంచె మీద వడిసెల - తిరుగుడింక ఆగలేదు
నువు సాకిన పంటేమొ - ఇంటికింక చేరలేదు
మాకిచ్చేసి వీర తెలంగాణా విప్లవాల విల్లు
ఏం కొంప మునిగింది వెళ్లి పోయావు మల్లు

పల్లవి: మల్లు వెంకట నర్సింహా
పీడిత జన ఉద్యమ బ్రహ్మా
నువ్వేసిన బాట వెంట చేరతాము ఎర్రకోట
నీ చరిత్ర అవుతుంది తల్లి నోట లాలిపాట

చరణం: మాటేమో శౌంఠి కొమ్ము- మనసేమో మైనమ్ము
ప్రశ్నలెన్ని పుట్టనియ్యి - ఆచరణే గీటురాయి
మార్క్సిజమే ఒరవడి - ఉద్యమమే ఊపిరి
ఆపలేదు నిర్బంధం - గరీబోళ్ల అనుబంధం
నీ మాటే వేదంగా నడిచాము ఇన్నాళ్లు
ఎలా ఆపుకోవాలి జ్ఞాపకాల వెక్కిళ్లు ॥మల్లు॥
గాదెలు నిండాలంటే - బోదెలన్ని పారాలని
చెలకలన్ని రైతన్నల పొలిపాటలు పాడాలని
కొడవళ్లు కక్కులతో- ప్రతి ఇంట్లో మెరవాలని

పల్లెల్లో ప్రతిరోజూ - సంకురాత్రి అవ్వాలని
ఉద్యమిస్తె బ్రతుకుల్లో వెల్లివిరియు సిరులు
కన్నావు నిరంతరం ఎన్నెన్నో కలలు ॥మల్లు॥

తెలంగాణలో నాడు- పలికినపుడు రుద్రవీణ
సాయుధ పోరాటంలో అనునిత్యం బిచాణా
బాంచనన్న బక్కోళ్లకు ఉండాలని రికాణా
పల్లె పల్లెకు చైతన్యం - చేసినావు రవాణా
నల్లగొండ పోరుతోట కాపాడిన తోటమాలి
యాడున్నావో చెప్పు తెచ్చుకుంటాం బతిమాలి ॥మల్లు॥

అతివాదం మితవాదం పొడిచినపుడు వెన్ను
విప్లవాన్ని కాపాడగ- మూయలేదు కన్ను
వేగుచుక్కవై నువ్వు- చేరినావు మిన్ను
ఊరూరా ఎర్రజెండ - మొలకెత్తును మన్ను
నీ అనుభవాలు మాకు అవుతాయి దన్ను
నడిచే ప్రతి ఉద్యమాన చూస్తాము నిన్ను ॥మల్లు॥

పుట్టుక గిట్టుటలన్నవి - ప్రతి జీవికి సహజమే
ఆశయాల ఔన్నత్యం- చేరనిది మరణమే
తరుణంలో వేస్తాము - ఉద్యమాల నాటు
తరతరాల సమరంలో - తరగదు నీ చోటు
అణచివేత అధిగమించు ఆశయాలు నీవి
ఎర్రజెండ వెలుగుల్లో నువ్వు చిరంజీవి ॥మల్లు॥

- దేవేంద్ర

వారనిపించుకున్నారు.

సి.ఎస్.రావుకు ఎన్టీరామారావుతో తీసిన చిత్రాలు చాలా పేరు తెచ్చి పెట్టాయి. వీరి కలయికతో 'అన్న-తమ్ముడు'తో మొదలుకుని 'శభాష్ రాముడు', 'టైగర్ రాముడు', 'కంచుకోట', 'వాల్మీకి', 'నిండుసంసారం', 'నిలువుదోపిడి', 'పెత్తందార్లు', 'మారిన మనిషి', 'ధనమాదైవమా?' వంటి 17 సినిమాలు రూపొందాయి. వాటిలో అన్ని వంద రోజులు ఆడినవే. ఈయన తీసిన 'కీలుబొమ్మలు', 'బంగారు గాజులు', 'మహాకవి క్షేత్రయ్య' చిత్రాలకు నంది అవార్డులు వచ్చాయి.

చదువుకునే రోజుల్లో జర్నలిజం పట్ల ఆయనకున్న ఆసక్తి 'మెరుపు' అనే లిఖిత మాస పత్రికను నిర్వహించేలా చేసింది. ఆ తరువాత చిత్రసీమలో చిదానందం అనే శీర్షికను విజయచిత్ర, సినిమారంగం పత్రికల్లో నిర్వహించి తొలినాటి తెలుగు సినీ విశేషాలను ఈ తరం వారికి అందించారు. 'బోడిబాబు'గా గూడవల్లి, హెచ్.ఎం.రెడ్డి, సి.పుల్లయ్య వంటివారి ప్రశంసలందుకుని సినిమాల్లో స్వయంకృషితో ఎదిగారు. చాలా సినిమాల్లో జడ్జిగా నటించారు.

కాగా సి.ఎస్.రావు వ్యక్తిగత జీవితంలో కొన్ని ఒడిదుడుకులెదుర్కొన్నారు. మొదటి అలనాటి దర్శక నిర్మాత కడారు నాగభూషణం-కన్నాంబల కుమార్తెను వివాహమాడారు. తర్వాత విడాకులిచ్చి నృత్య నాయిక రాజసులోచనను పెళ్ళి చేసుకున్నారు. కానీ చివరి రోజుల్లో వీరు విడివిడిగా గడిపారు. బోదకాలుతో బాధపడుతూ చెన్నైలోని వృద్ధాశ్రమంలో తన శేషజీవితాన్ని గడుపుతూ డిసెంబర్ 8న సి.ఎస్.రావు కన్నుమూశారు. మరణించే నాటికి ఆయన వయసు 81 సంవత్సరాలు. తెలుగు సినిమా తొలి తరానికి చెందిన ఎందరో దర్శక నిర్మాతలలో చెప్పుకోదగిన సి.ఎస్.రావు చిరస్మరణీయులు.

న్యాయసలహాలు



జి.ఎల్.నరసింహారావు, హైకోర్టు న్యాయవాది

తండ్రి పెన్షన్ ఎవరికి?

మా నాన్నగారు 1992లో మెడికల్ వాలంటరీ రిటైర్‌మెంట్ పెట్టి నాకు ఉద్యోగం ఇప్పించారు. మా ఫ్యామిలీలో మా అక్కయ్య వికలాంగురాలు. ఆమెకు ఒక కన్ను కనబడదు. ఈ మధ్య తండ్రి పెన్షన్ వికలాంగుల పిల్లలకి వస్తుందని ఎంప్లాయిస్ వాయిస్ బుక్‌లో జి.ఓ. ఇచ్చారు. మేము ఎవరిని కలవాలి? ఎవరిని సంప్రదించాలి? దయచేసి మాకు తొందరగా సమాధానం ఇవ్వగలరని కోరుతున్నాను.

- ఏ.లక్ష్మారెడ్డి, ఏ.రామిరెడ్డి, ఉండవల్లి, గుంటూరు జిల్లా

మీరు చదివిన జి.ఓ. గురించి పూర్తి విషయాలు రాయలేదు. అది వి.ఆర్.ఎస్. తీసుకున్న వారికి వర్తిస్తుందా, లేదా అనేది ఆ జి.ఓ.లో ఏముందో సవివరంగా తెలియనిదే ఏమీ చెప్పలేం. పెన్షన్ మీ నాన్నగారి తర్వాత అమ్మగారికి మాత్రమే వస్తుంది.

సర్వీస్‌మెన్ కోటా - ప్రమోషన్

నేను పది సంవత్సరాలు మిలట్రీలో పని చేశాను. యుద్ధంలో కూడా పాల్గొన్నాను. దానికి సంబంధించిన రికార్డు ఉంది. తరువాత మిలట్రీ ఉద్యోగానికి రాజీనామా చేశాను. వెంటనే నాకు స్టేట్ గవర్నమెంట్‌లో రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం వచ్చింది. నేను ప్రస్తుతం మండల రెవెన్యూ అధికారిగా పని చేయుచున్నాను.

(1) నాకు మాజీ సైనికుల ఉద్యోగుల కోటాలో ప్రమోషన్ వచ్చే అవకాశం ఉందా?

(2) నాకు రిటైర్‌మెంట్ వయస్సు కూడా దగ్గర పడింది. 30 సంవత్సరాల నుండి రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్నాను. దయచేసి నాకు ప్రమోషన్ వచ్చే మార్గాన్ని చూపగలరని ఆశిస్తున్నాను. మిలట్రీలో ఎంతోసేవ చేశాను. నేను చేసిన సేవకు గుర్తింపుగా నాకు ప్రమోషన్ కోసం హైకోర్టుకు వెళితే న్యాయం జరుగుతుందా?

(3) హైకోర్టుకు వెళితే ఎంత కాలం పడుతుంది. ఈలోపు నేను రిటైర్ అవుతానేమో అని దిగులుగా ఉంది? నేను ఏ విధంగా వెళితే న్యాయం జరుగుతుందో నాకు సరైన గైడెన్స్ ఇవ్వగలరని ఆశిస్తున్నాను.

(4) మిలట్రీలో యుద్ధంలో పాల్గొన్న రికార్డు అంతా ఉంది. దయచేసి నేను చేసిన సేవకు గుర్తింపుగా ఇక్కడి స్టేట్ గవర్నమెంట్‌లో నా రిటైర్‌మెంట్‌కు ముందు ప్రమోషన్ వచ్చే మార్గాన్ని చూపగలరు.

- ఒక ఎక్స్‌సర్వీస్‌మేన్

మీరు మిలట్రీలో పని చేసినందుకే సర్వీస్‌మెన్ కోటాలో మీరు ఉద్యోగం పొంది ఉంటారు. 30 సంవత్సరాల నుంచి రెవెన్యూ డిపార్టుమెంట్‌లో పని చేస్తూ ప్రస్తుతం సర్వీస్‌మెన్ కోటాలో ప్రమోషన్ పొందలేరు. అపాయింట్‌మెంట్ అప్పుడే మీరు ఆ కోటాలో ప్రియారిటీ పొంది ఉంటారు.

నాకు న్యాయం చేయండి

నా పేరు శ్రీదేవి. నేను డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుచున్నాను. నా పుట్టిన తేదీ 29.2.1987. నా పుట్టిన తేదీ సరియైనది కాదు. ఎందుకనగా 1987 లీపు సంవత్సరం కాదు. ఆ ఫిబ్రవరి నెలకు 29 రోజులు ఉండవు. కాని నిజమైన పుట్టిన రోజు తెలియక స్కూల్‌లో అందాజగా ఫిబ్రవరి 29, 1987 అని రాశారు. ఇన్ని రోజులు నాకు ఏమి ఇబ్బందులు కలగలేదు. కాని ఇప్పుడు నాకు ఒక సమస్య ఎదురైంది. ఎంప్లాయిమెంట్ కార్డు తీయడానికి వెళ్తే అక్కడ కంప్యూటర్ రిజెక్ట్ చేసింది. ఇంకా భవిష్యత్తులో ఏమైనా ఇబ్బందులు ఎదురవుతాయేమోనని నాకు చాలా భయంగా ఉంది. నా పుట్టిన తేదీని మార్చుకోవడం ఎలా? నేను 10వ తరగతి వరకు చదివిన స్కూల్‌కు వెళ్లి ప్రిన్సిపాల్‌గారిని అడిగితే కోర్టు ద్వారా సమస్యను పరిష్కారం చేసుకోవాలన్నారు. నాకు కోర్టులో ఏ విధంగా అప్పీలు చేసుకోవాలో తెలియదు. కోర్టుద్వారా సాల్వ్ చేసుకోవడానికి ఎంత డబ్బు ఖర్చవుతుంది. నేను పేద కుటుంబానికి చెందిన అమ్మాయిని. కావున దయచేసి నా సమస్యకు పరిష్కారం కోర్టు ద్వారా లేక ఎస్ఎస్‌సి బోర్డు ద్వారా మార్చుకోవాలో తెలుపగలరని ఆశిస్తూ...

- కె.శ్రీదేవి, వనపర్తి

మీరు పుట్టిన రోజు తప్పుగా పడితే మీ దగ్గరలోని కోర్టులో డిక్లరేషన్ దావా వేసుకోవలసి ఉంటుంది. మీ సరైన డేటాఫ్‌బర్త్ ఏమిటో వివరిస్తూ తప్పుగా నమోదైన విషయం వివరిస్తూ గవర్నమెంట్‌కు ఎస్.ఎస్.సి. బోర్డ్‌ను ప్రతివాదులుగా చేర్చి దావా వేయాల్సి ఉంటుంది. మీ ఆర్థిక పరిస్థితి అనుకూలంగా లేకపోతే మీరు దగ్గరులోని కోర్టులో లీగల్ ఎయిడ్‌కు దరఖాస్తు చేసుకుంటూ ఏ ఖర్చు లేకుండా వారే దావా వేయగలరు.

హ్యాపీ బర్త్‌డే

(19-12-2004 నుంచి
25-12-2004 వరకు)

సిహెచ్.దివ్య
6సం॥, 25.12.1998
రజిత-రమేష్
నారక్కపేట-వరంగల్

బి. ఉదయ్‌నాయక్
1సం॥, 25.12.2003
విజయ-బాలు
మొసన్‌గడలుండ-నల్లగొండ

ఎస్. లిఖిత
3సం॥, 25.12.2001
దివ్యశ్రీ-శివకుమార్
శివాజీనగర్-కరీంనగర్

ఎం.లక్ష్మీరామకృష్ణసాయి
3సం॥, 25.12.2001
నీరజ-చంద్రరావు
మచిలీపట్నం-కృష్ణా

ఎం. ఆనందశాస్త్రి
5సం॥, 25.12.1999
భ్రమరాంబిక-సూర్యనారాయణమూర్తి
సీతాఫల్‌మండి-సికింద్రాబాద్

వి. ఉత్తేజ్‌బాబు
3సం॥, డిసెంబర్-2001
వరలక్ష్మి-ఉదయ్‌కుమార్
మహబూబ్‌నగర్

మహెషీర్ జహాన్
2సం॥, డిసెంబర్-2002
షిరీన్‌బేగం-మస్తాన్
రాజరాజేశ్వరపేట-విజయవాడ

శ్రావణి
తులసి-నారాయణ
ఎల్లమ్మబండ-హైదరాబాద్

ప్రవలి
రేణుక-శ్రీను
బోదవాడ-జగ్గయ్యపేట

హరీష్
రేణుక-శ్రీను
బోదవాడ-జగ్గయ్యపేట

సన
3సం॥డిసెంబర్-2001
సాలేహా-బేగ్
ముషీరాబాద్-హైదరాబాద్

బి. తరుణ్‌కుమార్
4సం॥, డిసెంబర్-2000
భాగ్యలక్ష్మి-రాజబాబు

ప్రియలక్ష్మి
సుగుణ-నారాయణ
నకిరేకల్-నల్లగొండ

వి. శ్రీకాంత్
3సం॥, డిసెంబర్-2001
సమత-కుమారాచారి
లంగర్‌హౌజ్-హైదరాబాద్

ఫహమీద సుల్తాన
7సం॥, డిసెంబర్-1997
నస్రీన్‌సుల్తాన-ఖలీలుల్లా
మహబూబ్‌నగర్

గమనిక: పదేళ్ళ వరకు వయస్సు గల చిన్నారులందరికీ ఈ 'హ్యాపీ బర్త్‌డే' శీర్షిక కింద ఉచితంగా శుభాకాంక్షలు తెలియచేస్తాం. దీనికి మీరు చేయవలసిందల్లా మీ చిన్నారి పుట్టిన రోజుకు 20 రోజులు ముందుగా ఓ కలర్ ఫొటో జత చేసి మీ చిన్నారి పేరు, పుట్టినతేదీ, తల్లిదండ్రుల పేర్లు, చిరునామా వంటి వివరాలు పంపడమే. ప్రజాశక్తి శుభాకాంక్షలతో మీ చిన్నారి పుట్టిన రోజును ఆనందంగా జరుపుకోండి.

పంపవలసిన చిరునామా:

హ్యాపీబర్త్‌డే, ప్రజాశక్తి ఆదివారం అనుబంధం, 1-1-298/4 ,
స్ట్రీట్ నెం. 1, అశోక్‌నగర్, హైదరాబాద్-20.



కలం స్నేహం

హాయ్ చిన్నారి నేస్తాలూ!

మీకూడా వీళ్లలాగా కలం స్నేహం చెయ్యాలని వుందా? మరి ఆలస్యం ఎందుకు? ఒక పోస్ట్‌కార్డు తీసుకుని మీ పేరు, వయసు, తరగతి, స్కూలు, హాబీలు, చిరునామా రాయండి. ఆ తర్వాత మీ కలర్ ఫొటోను అతికించి పోస్టు చెయ్యండి. అంతే ఎంచక్కా ప్రచురిస్తాం. అన్నట్టు, ఈ పుస్తకాన్ని మీ స్నేహితులకూ చూపించి అన్ని విషయాలూ చెప్పండి. వాళ్లకు కూడా కలం స్నేహం చెయ్యాలని వుంటే కార్డు మీద రాసి మాకు పంపమనండి. మరి మా అడ్రస్: **కలం స్నేహం,** బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాదు.

పేరు : తెల్లాకుల తరుణ్
వయసు : 6 సం॥
చదువు : 2వ తరగతి
హాబీలు: ఆటలు ఆడడం, ప్రజాశక్తి ఆదివారం అనుబంధం చదవడం.
చిరునామా:
టి.తరుణ్,
సన్నాఫ్ శ్రీనివాసరావు,
బోనకల్,
ఖమ్మం జిల్లా.

పేరు : డి.వంశీప్రియ
వయసు : 7 సం॥
చదువు : 3వ తరగతి
హాబీలు: పేపరు (ప్రజాశక్తి) చదవడం, క్రికెట్ ఆడడం, టీవీ చూడడం.
లక్ష్యం: డాక్టర్ కావడం
చిరునామా:
డి.వంశీప్రియ, డాటరాఫ్ రఘురాం,
ఇంటి నెం: 28/176, ఫస్ట్ ఫ్లోర్,
3rd క్రాస్, చిత్తూరు.

పేరు : షేక్ నసీమా
వయసు : 11 సం॥
చదువు : 6వ తరగతి
హాబీలు: చదవడం, చదరంగం ఆడటం, గొప్ప వారి గురించి తెలుసుకోవడం.
లక్ష్యం: డాక్టర్ కావడం
చిరునామా:
షేక్ నసీమా, డాటరాఫ్ జాఫర్,
కేరాఫ్ శ్రీ కాకతీయ విద్యా మందిర్,
ఇంటి నెం: 8-1-306,
నల్గొండ - 508 001.

పేరు : టి.స్వరిక్
వయసు : 9 సం॥
చదువు : 4వ తరగతి
హాబీలు: డ్రాయింగ్ వేయడం, క్రికెట్ ఆడడం, కథలు చదవడం.
చిరునామా:
టి.స్వరిక్,
సన్నాఫ్ నాగేశ్వరరావు,
4వ తరగతి,
జి.ఎం.యు.పి.స్కూల్,
గూడూరు - 524 101, నెల్లూరు.

పేరు : బోరు సాయిప్రసాద్
వయసు : 7 సం॥
చదువు : 1వ తరగతి
హాబీలు: ఆటలు ఆడడం, డ్రాయింగ్ వేయడం, చదవడం.
లక్ష్యం: కలెక్టర్ కావడం.
చిరునామా:
బోరు సాయిప్రసాద్, సన్నాఫ్ సాయిలు,
కొండాపూర్, గండీడు (మం),
రంగారెడ్డి జిల్లా.

పేరు : జంగా వైష్ణవి (సోని)
వయసు : 6 సం॥
చదువు : 1వ తరగతి
హాబీలు: ఆటలు ఆడడం, పాటలు పాడడం, ప్రజాశక్తి 'చిన్నారి'లోని జోక్స్, పజిల్స్‌లో పాల్గొనడం, టీవీ చూడడం.
చిరునామా:
జంగా వైష్ణవి, డాటరాఫ్ దయాకర్,
ఇంటి నెం: 1-6-202/17/4,
బాపూజీ నగర్, ముషీరాబాద్,
హైదరాబాద్.

పేరు : బి.రోజా
వయసు : 10 సం॥
చదువు : 5వ తరగతి
హాబీలు: చదవడం, మిమిక్రీ చేయడం, డ్రాయింగ్ వేయడం.
లక్ష్యం: డాక్టర్ కావడం.
చిరునామా:
బి.రోజా, మాసానిపల్లి,
ఆత్మకూర్ (పోస్ట్), నాగిరెడ్డిపేట్
(మం), నిజామాబాద్ జిల్లా.

పేరు : ముత్తారపు తిరపతిరావు
వయసు : 15 సం॥
చదువు: 10వ తరగతి
హాబీలు: జోక్స్, పత్రికలు చదవడం, వార్తలు, సంగీతం వినడం.
లక్ష్యం: ఉన్నతమైన వ్యక్తి కావడం.
చిరునామా:
ముత్తారపు తిరపతిరావు,
సన్నాఫ్ బసవయ్య, ఇంటి నెం: 1-11,
తూటికుంట్ల, బోనకల్ (మం),
ఖమ్మం - 507 208.